
మరనాత మెసేంజర్
MARANATHA MESSENGER
విడి ప్రతి
రూ.10/-
దేవుడు ఆత్మయై యున్నాడు
గనుక ఆయనను ఆరాధించువారు
ఆత్మతో సత్యముతో ఆరాధించవలెను
The Six Junctures in a Human Life
సంపుటి 37
ఫిబ్రవరి 2019
సంచిక 2

# లూకా సువార్త
## (32 వ భాగము)

శ్రీ జి. మోజెస్ చౌదరి, విజయవాడ

## కన్నీటితో పాప ప్రక్షాళన : ( లూకా సువార్త 7 : 36-50)

పాఠకమిత్రులకు ప్రభువైన యేసుక్రీస్తు నామములో శుభములు, ఆశీస్సులు కలుగునుగాక! ఈమాసములో పశ్చాత్తాపంతో కన్నీళ్లతో తన పాపాలను కడుగుకొని ప్రక్షాళన చేసుకొన్న ఒక భాగ్యవంతురాలిని గూర్చి మీతో పంచుకోవాలని. యేసు మానవరూపిగా ఉన్నకాలంలో 33 1/2 సంవత్సరాలు మాత్రమే భూమిమీద ఉన్నాడు. అందులో కేవలము మూడున్నర సంవత్సరాలు మాత్రమే పాదచారిగా ఊరూరు సంచారం చేస్తూ తన పన్నెండు మంది శిష్యులను వెంటబెట్టుకొని వినువారందరికి వీధుల్లోను, సంతవీధుల్లోను, సంద్ర తీరాలలోను, కొండల్లోను, కోనల్లోను ఎక్కడ ప్రజలు ఉంటే అక్కడ దైవ బోధలు చెబుతూ వచ్చాడు. ఒకరోజు పరిసయ్యుడైన సీమోను అనే పేరు కలిగినవాడు యేసుని, ఆయన శిష్యులను కూడ తన ఇంటికి విందుభోజనానికి ఆహ్వానించాడు.

ఆ రోజుల్లో యూదామత ప్రవిష్టులలో 'పరిసయ్యులు' చాలా నిష్టాగరిష్టులైన మత నాయకులు. పరిసయ్యులు భక్తిని మత సంబంధమైన బాహ్యపు, శారీరకమైన ఆచారాలకు పరిమితం చేసినవారు. స్వనీతినే దేవుని నీతి అని భ్రమపడుతూ భక్తి పేరుతో ఆధ్యాత్మిక అంధత్వాన్ని పెంచుకున్నవాళ్లు. నైతిక విలువలకంటె మతాచారాలకు ఎక్కువ ప్రాధాన్యత నిస్తూ తన పాపాన్ని కూడ గుర్తించలేని దురదృష్టవంతులు. ఎరుగకుండానే తన్ను తాను మోసపుచ్చుకొంటూ ఉంటాడు. పరిసయ్యుడు మత గ్రంథాలు చదువుతాడు, మతసూక్తులు చెబుతాడు కాని అతని బ్రతుకులో మాత్రం మార్పు ఉండదు. ఇట్టివారికి దేవుని నిఘంటువులో, జీవగ్రంథములో తావులేదు.

పరిసయ్యుడైన సీమోను యేసును, ఆయన శిష్యులను తనఇంటికి విందుభోజనానికి ఆహ్వానించాడు. అతిధులను సత్కరించుటకు ఆకాలంలో యూదయ దేశంలో కొన్ని సంప్రదాయాలు ఉండేవి. అవేమిటంటే - అతిధులకు కాళ్లు కడుక్కోవడానికి నీళ్లివ్వాలి. ఇప్పటికీ మనపల్లెల్లో ఈసంప్రదాయం ఉంది, అలాంటి సంప్రదాయం అక్కడకూడ ఉండేది. ఆ తరువాత తుడుచుకోవడానికి తువ్వాలు ఇవ్వాలి, తరువాత ఆలింగనం చేసుకొని రెండు భుజాలమీద తల ఆనించి ముద్దుపెట్టుకోవాలి. ఇప్పటికి వారు అవే సంప్రదాయాలను పాటిస్తున్నారు. సీమోను ఆ సంప్రదాయాలను మర్చిపోలేదు గాని వాటి చొప్పున అతడు యేసుకు మర్యాద చెయ్యలేదు. మరొకమాటలో చెబితే ఇంటికి

పిలిచి అవమానించాడు. ఇంత గొప్ప దైవజ్ఞుని, బోధకుని, లోకమంతా ఆకర్షితులయ్యి ప్రజలంతా తండోపతండాలుగా వెంబడిస్తూఉన్న యేసయ్యను ఇంటికి ఆహ్వానించి సంప్రదాయబద్ధంగా ఇంట్లోకి స్వీకరించడం చేతకాని వ్యక్తిగా ఇక్కడ పరిసయ్యుడైన సీమోను కనబడుతున్నాడు. మతమౌఢ్యంతో పాటు, మత అహంకారం కూడా ఉందేమో అనుకుంటాను.

ఆరోజుల్లో విందులు ఎలా ఉండేవంటే - వేసవికాలంలో ఆరుబయట భోజనాలు చేసేవారు. అలా భోజనాలు చేసే సమయంలో ఆ గ్రామములో ఉన్నవారు ఎవరో ఫలానా వారింటికి ఒక దైవజ్ఞుడైన బోధకుడు, రబ్బీ వచ్చాడు అనేకబురు ఆ గ్రామస్తులకు తెలుపగా, వచ్చి కూర్చొని బోధలు వినేవారు. ఆ బోధ అయిన తరువాత వీరి భోజనము జరిగేది. పరిసయ్యుడైన సీమోను ఇంటిలో యేసుప్రభువు బోధించు సమయములో ఒక ఆడమనిషి వచ్చింది. ఆమె ఒక వేశ్య, పాపాత్మురాలు అని బైబిల్‌లో వ్రాయబడిఉంది. పాపమనే దారుణ మారణ వ్యాధిసోకి పాపముచేత పుచ్చుదశకు చేరుకున్న స్త్రీ. పరిస్థితులు ప్రతికూలమైనందున ఆమె ఈవేశ్యావృత్తిలో బంధితమై పోయిందేమో? ఏదిఏమైనా ఆమె జీవితం దుర్భరమైపోయింది. యేసు బోధను వింటున్నప్పుడు ఆమె అంతరంగములో అద్భుతమైన ఆధ్యాత్మిక సంచలనం, విప్లవం చెలరేగింది, తన పాపం స్పష్టంగా తెలుస్తూ ఉండగా, అందుకు విరుగుడు యేసు పాదాలదగ్గర ఉందని నమ్మింది, తెగించి ఆ పరిసయ్యుని ఇంటి ఆవరణములో యేసు భోజనానికి కూర్చున్న తరువాత యేసు దగ్గరికి వచ్చింది.

ఆరోజుల్లో భోజనం చేసేటప్పుడు యూదుల ఆచారమేమంటే - ఎడమచేతిని పోటీగా పెట్టుకొని వంగి కుడిచేతితో భోజనాలు చేసేవారు. తద్వారా రెండు పాదాలుకూడా ఒక ప్రక్కకి మడిచిఉండేవి. అలా కూర్చున్న యేసు విందుభోజనం చేస్తుంటే పాపాత్మురాలైన ఆ స్త్రీ యేసు పాదాలదగ్గరకు వచ్చి, ప్రణమిల్లింది. బహుగా విచలితురాలై తనలోఉన్న పశ్చాత్తాపము కన్నీటిరూపంలో వస్తుండగా, యేసు పవిత్రమైన పాదాలను తన కన్నీటితో తడపటం, కడగటం మొదలుపెట్టింది. అలా ఆమె తనలోని అపవిత్రతనంతా కడిగేసుకుంది. పశ్చాత్తాపమనేది మనిషియొక్క అంతరంగములో గూడు కట్టుకొన్న పాపపు ధోరణిని, బుద్ధులను, అలవాట్లను కడిగేసుకోవడానికి దోహదపడు తుంది. స్త్రీలు సహజంగా తలవెంట్రుకలను పవిత్రంగా ఎంచుకొంటారు. అటువంటి తన తలవెంట్రుకలను విడదీసి కన్నీటితో కడిగిన యేసు పాదాలను తుడిచి, ఆయన పాదములను ముద్దుపెట్టుకొని, ఒక బుడ్డిలో తాను తెచ్చిన అత్తరును యేసు ప్రభువు పాదములకు పూసింది. ప్రభువు అనుగ్రహమును, పాప క్షాళన పొంది ధన్యురాలయ్యింది, చరిత్రలో నిలిచిపోయింది. ఇదంతా చూస్తున్నాడు మత వ్యవహారాలలో నిష్ణాతుడు, ఆచారాల భక్తిలో బంధితుడై, అదే నిజమైన భక్తి అనే భ్రమలోఉన్న దురదృష్టవంతుడు

పరిసయ్యుడైన సీమోను. అదిచూచి - ఈయన నిజంగా దైవజ్ఞుడు, దైవస్వరూపుడైతే ఈమె ఎవరో, ఎటువంటిదో తెలియకుండా ఉంటుందా, ఇది పాపాత్మురాలు అని లోలోపల అనుకొంటున్నాడు. అతని ఆంతర్యమును, అంతరంగమును క్షుణ్ణంగా ఎరిగిన యేసు సీమోనుతో - సీమోనూ, నీతో ఒకమాట చెప్పాలని ఉన్నాను అని అతనితో అనగా, అతడు- బోధకుడా, చెప్పుమనెను.

అప్పుడు యేసు - సీమోనూ, ఒక మనిషికి ఇద్దరు అచ్చిదారులున్నారు, ఒకడు 500 దేనారములు, ఇంకొకరు 50 దేనారములు అచ్చియున్నారు. ఆ అప్పు తీర్చుటకు వారియొద్ద ఏమియు లేకపోయెను గనుక అప్పు ఇచ్చినవ్యక్తి ఆ ఇద్దరిని క్షమించేసాడు. అప్పుడు వాళ్లిద్దరిలో ఎవరు అప్పిచ్చినవానిని ఎక్కువ ప్రేమిస్తారు చెప్పు? అని అడిగాడు. అందుకు సీమోను - అతడు ఎవనికి ఎక్కువ క్షమించెనో వాడే అని నాకు అనిపిస్తుంది అని చెప్పగా, యేసు - నీవు సరిగానే యోచించావు. ఆమె పాపాత్మురాలైన మాట నిజమే. వేశ్యావృత్తిలో బంధితురాలై బ్రతుకుతూ విడుదల కోరుకొంది. నేను నీ యింటిలోనికి రాగా, నీవు నా పాదములు కడుగుకొనుటకు నీళ్లియ్యలేదు గాని, ఈమె తన కన్నీళ్లతో నా పాదములను తడిపి, తన తలవెంట్రుకలతో తుడిచెను. నీవు నన్ను ముద్దు పెట్టుకొనలేదు గాని, నేను లోపలికి వచ్చినప్పటినుండి ఈమె నా పాదములు ముద్దుపెట్టుకొనుట మానలేదు. నీవు నూనెతో నా తల అంటలేదు గాని, ఈమె నా పాదములకు అత్తరుపూసెను. ఆమె విస్తారము గా ప్రేమించెను గనుక ఆమెయొక్క విస్తార పాపములు క్షమించబడెనని నీతో చెప్పుచు న్నాను. ఎవనికి కొంచెముగా క్షమింపబడునో, వాడు కొంచెముగా ప్రేమించునని చెప్పి, నీ పాపములు క్షమింపబడియున్నవని ఆమెతో అనెను. 'నీ విశ్వాసము నిన్ను రక్షించెను, సమాధానము గలదానవై వెళ్లుమని ఆ స్త్రీతో చెప్పెను.

ఒక మనిషి తనలో దాగిఉన్న పాపాన్ని చూచుకోలేకపోతే అట్టివాడు ఆధ్యాత్మికంగా అంధత్వములో, గ్రుడ్డితనములో ఉన్నట్లులెక్క. **తన పాపాన్ని చూచుకొన్నప్పటికీ, దాచుకొన్న వాడు తాను కూర్చున్న చెట్టుకొమ్మను తానే నరుక్కొనే మూర్ఖుని పోలిఉంటాడు. కాని తన ఆలోచనల్లో, భావాల్లో, చూపుల్లో, మాటల్లో, క్రియల్లో గల పాపాన్ని, దోషాన్ని గుర్తించి పాపుల రక్షకుడైన యేసుస్వామిని నమ్ముకొని పశ్చాత్తాపముతో, కన్నీటితో, వేదనతో ఆక్రందన చేస్తూ తన పాపాలు ఒప్పుకొన్న అట్టివాడు ప్రక్షాళన పొందుతాడు.** అట్టి భాగ్యాన్ని పొందుకున్నవారు భూమిమీద కోటానుకోట్లుగా ఉన్నారు, అందులో నేనుకూడ ఒకడిని. పాఠకులారా, నేను మనవిచేస్తున్నాను - పాప క్షమాపణ పొందడమే మానవాత్మ రక్షణ పొందినది అనడానికి రుజువు. ఇట్టివాడు ఆత్మలో శాంతిని పొందుకున్నట్లు లెక్క. అంటే దేవునికి అతనికి మధ్య సత్సంబంధం ఏర్పడినట్లు. అట్టి దివ్యానుభూతిని మీరు పొందారా !? అట్టి భాగ్యాన్ని మీరు పొందియుండకపోతే, మీరెంత గొప్పవాళ్లయినా, ఎంత ధనికులైనా, అందచందాలు అంతస్తులు, పేరుప్రఖ్యాతులు గడించినా మీరు దేవుని దృష్టిలో

దోషులుగానే మిగిలిపోతు న్నారని మీరు తెలుసుకోవలెను.

పాఠకులారా, మహాదేవుడైన యేసు మీ అంతరంగములో ఏమని తలపోస్తున్నారో అదంతా క్షుణ్ణంగా ఎరిగినవాడు. ప్రతి మనిషిని అణువణువున క్షుణ్ణంగా ఎరిగిన ప్రభువైన యేసు దేవుడు ఆనాడు పరిసయ్యుని మనసులో చెలరేగుతున్న ఈ ఆలోచనలు గుర్తెరిగి అతనికి జవాబిచ్చాడు. తన పాపమును తన గుండెల్లో దాచుకొన్న మనిషి చాలా దురదృష్ట వంతుడు. అటువంటి వ్యక్తి ఎంత పేరుప్రఖ్యాతులు కలిగినవాడైనప్పటికిని, ఎన్ని తలాంతులు కలిగినవాడైనప్పటికిని దేవుని దృష్టిలో దోషిగానే మిగిలిపోతాడు. కాని తన దోషాన్ని గుర్తించిన ఒక నరహంతకుడు, వ్యభిచారి, వేశ్య, మోసగాడు, దొంగ, జూదగాడు మరియు ఎంత దారుణమైన పాపానికి బానిసయై బ్రతుకుతున్నవారైనా పశ్చాత్తాపంతో దాన్ని ఒప్పుకొంటే, అతడు లేక ఆమె గొప్ప భాగ్యవంతులు. అట్టివారు కడుంగడు ధన్యజీవులు. అట్టి భాగ్యము మీరు పొందుకోవాలని ప్రభువైన యేసు నామమున నేను మీకు హితవు చెబుతున్నాను. అట్టి భాగ్యాన్ని పొందుకొంటే కలిగే దివ్యమైన అనుభూతి, ఆనందం అనిర్వచనీయం!! లోకంలో ఎక్కడా దొరకనిది, వెలపెట్టి కొనలేని అద్భుతమైన పాప క్షమాపణ, ఆత్మరక్షణ, ఆత్మశాంతి అనే ఈ భాగ్యాన్ని ఆధ్యాత్మికంగా మీరు పోగుకోవలసిందిగా హితవు చెబుతు న్నాను. దేవుడు మిమ్మును అద్భుతముగా దర్శించి, మీలో అట్టి చైతన్యాన్ని కలిగించాలని నా ఆకాంక్ష. దేవుడు మీకుటుంబాన్ని, ఉద్యోగ వ్యాపారాలను బహుగా ఆశీర్వదించునుగాక!

**- మరనాత.**

## సంగీత, సాహిత్య ప్రియులకు ప్రకటన

**డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి కలం నుండి వెలువడిన, నిరీక్షణ మెలోడీస్ సమర్పణలో వాల్యూం-3 ఆత్మాంజలి గీతమాలికను మరనాత విశ్వాస సమాజం, వ్యవస్థాపక అధ్యక్షులు మాన్యశ్రీ గుళ్ళపల్లి మోజెస్ చౌదరి గారి ఆశీస్సులతో డిశంబరు 25 న హైదరాబాదులోనూ, డిశంబరు 31 న విజయవాడలోనూ ఆవిష్కరించటమైనది. అందులో ఆత్మాంజలి పాటలతోపాటు, యింతకు ముందు మేము రూపొందించిన హృదయాంజలి, స్తోత్రాంజలి గీతమాలికలు మరియు మాన్యశ్రీ మోజెస్ చౌదరి గారి ప్రసంగాలు, డా॥ నిరీక్షణ కె. కంచర్ల గారి ప్రసంగాలు అందించటమైనది. ఈసారి ప్రజల సౌకర్యార్థం 16 జి.బి. పెన్‌డ్రైవ్‌లో పైన ప్రస్తావించిన పాటలు, ప్రసంగాలు పొందుపరచాము. కావలసినవారు ఈ క్రింది అడ్రసుకు సంప్రదించవలసినదిగా మనవి. మీ పూర్తి అడ్రస్సు, ఫోన్ నెంబరుతో రూ.500/-లు పంపి కొరియర్ ద్వారా పొందగలరు.**

**-: BANK DETAILS :-**
**ORIENTAL BANK OF COMMERCE**
**MARANATHA VISVASA SAMAJAM**
**SB. A/c.No.10932011013854**
**IFSC : ORBC0101093**
**Ameerpet, Hyderabad - 16.**




**డా॥ నిరీక్షణ కె. కంచర్ల**
**మరనాత గ్రౌండ్స్, 12-7-133/81/2/1**
**రాఘవేంద్ర నగర్, కుకట్‌పల్లి**
**హైదరాబాదు-500 072.**
**సెల్ : 98497 46464**

# అభ్యర్ధన - ఆచరణ - ఆశీర్వాదము

ఆయన (యేసు) మీతో చెప్పునది చేయుడి

డా॥ నిరీక్షణ కె. కంచర్ల
M.A., MBA., M.A., M.Div., M.Th., D.Min., (Ph.D.)
డైరెక్టర్ - మరనాత థియోలాజికల్ సెమినరీ
హైదరాబాదు. సెల్ : 9849746464

## దోతాను లో ఎలీషా

పాఠక మిత్రులకు శుభములు.

దైవానుగ్రహం ద్వారా సంక్రమించే సంరక్షణ సృష్టిలోని ప్రతి జీవికి ఎంతో అవసరం. ఆర్థిక సంపదలు, బంధుబలగాలు, పేరుప్రఖ్యాతులు, అపార మేధస్సు ఎంత ఉన్న దైవం తోడు లేకపోతే సర్వం శూన్యం !!! అందుకే సర్వలోకనాధుని ఆశీస్సులు అందరికి అవసరం. కొన్ని భౌతిక అంశాలు కష్టపడటం ద్వారా పొందవచ్చును గాని, దేవుని వలన మాత్రమే సాధ్యమయ్యే ప్రాణ సంరక్షణ, దీర్ఘాయువు, జ్ఞానం వెలపెట్టి కొనలేనివాటిలో ప్రాముఖ్యమైనవి.

అది క్రీస్తు పూర్వం 970-586 మధ్యకాలం. ఆనాటి మహాసామ్రాజ్యముగా వెలుగొందిన ఇశ్రాయేలు రాజ్యంలో దైవప్రతినిధియైన ఎలీషా ప్రవక్త ఆధ్వర్యంలో జరిగిన మరో అద్భుత సంఘటన. ఆనాటి ఇశ్రాయేలు సామ్రాజ్యాన్ని 9వ రాజైన యెహోరాము పరిపాలన చేస్తున్నాడు. అతడు అంతగా చెప్పుకోదగినవాడు కాకపోయినా ఆనాటి వంశపారంపర్యాను సారంగ సంక్రమించిన అధికారమును పొందుకున్నవాడు. రాజులను, చక్రవర్తులను సన్మార్గంలో నడిపించటానికి దేవుడు తన ప్రతినిధులైన ప్రవక్తలను ఎన్నుకొని ఏర్పాటు చేయటం పరిపాటి. అయితే అధికార అహంకారంతో దైవప్రతినిధుల హెచ్చరికలను త్రోసిపుచ్చి అనేక కష్టాలను చేతులారా కొనితెచ్చుకున్న వారనేకులను గతంలోనూ, ప్రస్తుతంలోనూ మనము చూస్తున్నాము. అయితే జరిగిన సంగతేమనగా ఇశ్రాయేలు దేశమునకు పొరుగున ఉన్న సిరియా ఎప్పుడూ ప్రక్కలో బల్లెంగా ఉండటం గమనార్హం. ఆదేశాన్ని అప్పుడు బెన్హదదు-2 పాలనచేస్తున్నాడు. ఏదోఒక సాకుతో పొరుగునున్న ఇశ్రాయేలు దేశమును ఆక్రమించుకోవాలనే తన ప్రయత్నాన్ని దైవప్రతినిధియైన ఎలీషా గ్రహించి దేశాన్ని కాపాడుతున్నాడు.

2 రాజులు 6 : 8-23 - ఇదొక విశేషమైన లేఖనభాగం. సిరియా రాజు తన అంతః పురంలో, ఆంతరంగికుల మధ్యలో ఇశ్రాయేలు దేశముతో యుద్ధము చేసి ఆక్రమించుకో వాలనే రహస్యాలోచనలను దైవప్రతినిధియైన ఎలీషా దైవాత్మ సహాయంద్వారా గ్రహించి

ఇశ్రాయేలు రాజుకు పలుమార్లు తెలియచేసి వారిని రక్షించటం జరిగింది. 2 రాజులు 6 : 8-10. అంకితభావం, సమర్పణ కలిగిన దైవసేవకులు ఎప్పుడూ ప్రజలకు దీవెనగా ఉంటారు. రాజులు సహితము వారిని గౌరవించి, తద్వారా వారి దేశములను సంరక్షించుకున్నారు. కనుక యోగ్యులైన దైవసేవకులు గౌరవానికి పాత్రులు. అట్టివారిని గుర్తించి, అనుసరించి దీవెనలు పొందాలి.

ఇకపోతే, సిరియా రాజైన బెన్హదదు - 2 కలహము లేకపోతే కునుకు పట్టనట్లున్నాడు!? కొంతమందికి ఎప్పుడూ ఏదో ఒక సమస్య ఉండాలి..? లేకపోతే ఏదో ఒక విధం కష్టపడి సమస్యలు సృష్టించుకుంటారు...!? పలుమార్లు సిరియా రాజు ప్రయత్నం విఫలం అయ్యింది. కారణం, ఎలీషా అద్భుత దైవజ్ఞానంతో ఆనాటి వారి దేశాన్ని కాపాడటంలో ప్రధానపాత్ర వహించాడు. పరిశుద్ధాత్మ సహాయంతో జరుగబోవు వాటిని స్పష్టంగా తెలియ చెయ్యటం ప్రవచనం. అంతేగాని భౌతిక పరిస్థితులను ఆధారం చేసుకొని శుభమో, అశుభమో జరుగబోతోందని చెప్పటం కొంత ఆలోచించవలసిన విషయం. కొన్నిసార్లు అనుభవజ్ఞులైన దైవసేవకులు, స్థిరపడిన విశ్వాసులు కూడా భౌతికప్రేరణలకు లొంగి ప్రవచించటం జరుగు తుంది. వారు కావాలని చెప్పకపోయినా, వాటివల్ల కొన్నిసార్లు కొంత నష్టం, కష్టం కలుగవచ్చు... !? కనుక ఆ కృపపొందిన వారు బహు జాగ్రత్తగా వినయంతో దానిని వినియోగించాలి. సిరియా రాజు పన్నాగం దేవుని చిత్తములో వీగిపోయింది. యోబు 5 : 12 - "వంచకులు తమ పన్నాగములను నెరవేర్చనేరకుండా ఆయన వారి ఉపాయములను భంగపరచును". కీర్తనలు 33 : 10 - "... ఆలోచనలను యెహోవా వ్యర్థపరచును, జనుల యోచనలను ఆయన నిష్ఫలములుగా చేయును".

2 రాజులు 6 : 11 - "సిరియా రాజు కల్లోలపడి తన సేవకులను పిలిచి, మనలో ఇశ్రాయేలు రాజు పక్షమున వహించినవారెవరైనది మాకు తెలియచెప్పరాదా అని వారిని అడుగగా...". సిరియా రాజుకు ఇశ్రాయేలీయులు సేవించే దేవుని గొప్పతనం తెలియలేదు. అతని దగ్గరనున్న ఆంతరంగికులలో ఎవరో ఇశ్రాయేలు రాజు పక్షంగా పనిచేస్తున్నాడని భ్రమపడ్డాడు. అయితే 2 రాజులు 6 : 12 లో - "అతని సేవకులలో ఒకడు - రాజువైన నా యేలినవాడా, ఇశ్రాయేలు రాజపక్షమున ఎవరును లేరుగాని ఇశ్రాయేలులోనున్న ప్రవక్త ఎలీషా మీ అంతఃపురమునందు మీరు అనుకొనిన మాటలు ఇశ్రాయేలు రాజునకు తెలియ జేయుననెను". రాజుదగ్గరనున్న సేవకునికి దైవజనుడైన ఎలీషా గొప్పతనం అర్థమయ్యింది గాని రాజుగారికి ఎందుచేతనో తెలియలేదు. ఇది నిజంగా ఆశ్చర్యం. మనమెంతకాలంగా దేవుని సేవలో ఉన్నాం... విశ్వాసులుగా ఉన్నాం... నాయకులుగా ఉన్నాం... ఇవన్నీ ప్రాముఖ్యమే గాని దైవసంబంధితమైన సంగతులను సరిగా అర్థంచేసుకుని, తదనుగుణంగా స్పందిస్తున్నామా లేదా అనేది ప్రధానం. చాలామందికి చాలా సంగతులు తెలియదు. కారణం వారికి వివేచన లేదు... కొంతమందికి రాదు కూడా.. కారణం ముఖస్తుతికి అలవాటు పడి, ఆ దురభ్యాసానికి అట్టివారు ఏనాడో బానిసలయ్యారు. వారికి వాస్తవాలకంటే,

అబద్ధాలైనా అందంగా చెప్పగలిగితే వారినే సన్నిహితులుగా భావించి, వారి సహచర్యాన్నే ఎక్కువగా కోరుకుంటారు. కాస్త ఆగి ఆలోచిస్తే సహేతుక విమర్శే ఓ వ్యక్తికి ఎక్కువ మేలు చేస్తుంది.. అయితే అందరికి అభినందనలంటేనే యిష్టం గదా.. !? కుటుంబాలలో గాని, దైవసేవకులలో గాని అనేక అనర్ధాలు జరగటానికి ప్రధాన కారణం వివేచనలేని విచిత్ర మనస్కులే కారణం. ఎవరు చెప్పినా, ఎంతమంది చెప్పినా వినకుండా, తీవ్రనష్టం జరిగేవరకు అనవసర సహనము, భయముతో వ్యవహరించి, వ్యవస్థను ధ్వంసం చేసి కాలం చేస్తున్నారు. తరువాత పెద్దగా చేయగలిగింది కూడా ఏమీ ఉండదు.. ?

13, 14 వచనం - “అందుకు రాజు - మేము మనుష్యులను పంపి అతని తెప్పించు నట్లు... కాబట్టి రాజు అచ్చటికి గుఱ్ఱములను, రథములను గొప్ప సైన్యమును పంపెను”. ఆశ్చర్యం, ఒక్క మనిషిని పట్టుకోవటానికి అంత సైన్యము అవసరమా..? మొత్తానికి దోతాను ప్రదేశాన్ని ఆక్రమించారు. సిరియా రాజుకు తెలిసుండాలి, అదేమనగా - అంతఃపురములో మాట్లాడుకునే మాటలు ఎలీషా దైవజ్ఞానంతో గ్రహిస్తున్నాడు... ఇప్పుడు నేను ఆయనను బంధించటానికి చేసే ఆలోచన కూడా గ్రహించి అక్కడనుండి తప్పించుకుంటాడేమో అని. కాని అతనికి ఆ ఆలోచన తట్టలేదు. కీర్తనలు 37 : 12 - “భక్తిహీనులు నీతిమంతుల మీద దురాలోచనలు చేయుదురు. వారిని చూచి పండ్లు కొరుకుదురు”. 37 : 22 - “భక్తిహీనులు నీతిమంతుల కొరకు పొంచియుండి వారిని చంపజూతురు”.

ఆ రాత్రి గడిచి తెలతెలవారబోతోంది. దైవజనుని దగ్గరనున్న శిష్యుడు / పనివాడు పెందలకడ లేచి బయటకువచ్చి, 2 రాజులు 6 : 15, 16, 17 - “... గుఱ్ఱములను రథములును గల సైన్యము పట్టణము చుట్టుకొనియుండుట కనబడెను... అయ్యో నా యేలినవాడా... మనమేమి చేయుదమని ఆ దైవజనునితో అనగా... అతడు - భయపడవద్దు మన పక్షమున నున్నవారు వారికంటె అధికులైయున్నారని చెప్పి... యెహోవా, వీడు చూచునట్లు దయచేసి వీని కండ్లను తెరువుమని ఎలీషా ప్రార్ధన చేయగా... ఆపనివాని కండ్లను తెరువచేసెను గనుక వాడు ఎలీషా చుట్టును పర్వతము అగ్ని గుఱ్ఱములచేత రథములచేతను నిండి యుండుట చూచెను”. ఒకరకంగా ఆపనివాడు ఎలీషా శిష్యుడే గాని, అంత అవగాహన కలిగినవాడు కాదు. అయినా ఎలీషా అతనిని తన దగ్గర ఉంచుకోవటం గొప్ప విషయం. అతడు మామూలు నేత్రాలతో చూచాడు, ఎలీషా పరిస్థితులను ఆత్మజ్ఞాన నేత్రాలతో చూచాడు. అదే నాయకులకునూ, నిజమైన నాయకులకున్న వ్యత్యాసం. ఎంతసేపూ భౌతిక పరిస్థితులను విశ్లేషిస్తూ, భయపడి ఇతరులను భయపెట్టడం, విశ్వాసంతో, దేవుడిచ్చిన భరోసాతో మాట్లాడకుండా... ఎంతసేపూ బలహీనపరచే విశ్లేషణలను జరిగించటం ఆత్మ జ్ఞానం, దూరదృష్టి లేనివారి పని. నిజమైన నాయకులు ఎప్పుడూ నిబ్బరంగానే ఉంటారు. జరిగిన సంభవాన్ని పరిశీలిస్తే ఎలీషాకు ఆముందురోజే తెలుసు సిరియారాజు తనను బంధించటానికి సైన్యాన్ని పంపిస్తున్నాడని ! ఎందుకంటే అతడు అంతఃపురములో మాట్లాడు కునే మాటలు ఆత్మజ్ఞానంతో గ్రహించాడు.

అలాంటప్పుడు ఎలీషాను బంధించే విషయం కూడా ఎలీషాకు తెలిసుండాలి !! విశేషమేమిటంటే విషయం తెలిసినా ఆరాత్రి ఎలీషా దోతానులోనే ఉండిపోయాడు. యెహోరాము ఆశ్రయాన్నికోరి తనను తాను రక్షించుకోవటానికి ప్రయత్నించలేదు !! ఇది నిజంగా నిబ్బరమైన బుద్ధికి నిదర్శనం. దేవుడు కొన్ని సంగతులను ముందుగా తెలియచేసి సంరక్షిస్తాడు, కొన్నిసార్లు ఏ సమస్యలో ఉన్నామో ఆ సమస్యనే దీవెనగా మలచి మేలుచేస్తాడు. బహుశా ఎలీషా - "మనుష్యులను నమ్ముకొనుట కంటె యెహోవాను ఆశ్రయించుట మేలు, రాజులను నమ్ముకొనుట కంటె యెహోవాను ఆశ్రయించుట మేలు" (కీర్తన 118 : 8, 9) అని భావించి ఉంటాడు. మరియు కీర్తనలు 146 : 3 - "రాజులచేతనైనను, నరులచేతనైనను రక్షణ కలుగదు, వారిని నమ్ముకొనకుడి". ఇశ్రాయేలు రాజైన యెహోరామును ఆశ్రయించటం కంటే, ఎంత కష్టం, నష్టం వచ్చిన దేవుని ఆశ్రయించటం మేలని భావించి, విషయం తెలిసినా దోతానులోనే ఎలీషా నిలిచియుండటం గమనార్హం!!

ఎలీషా చేసిన మరో గొప్పపనేమిటంటే, ఆముందురోజు రాత్రి, తనకు దేవుడు బయలు పరచిన, అనగా సిరియా రాజు ముట్టడి సమాచారాన్ని తన పనివానికి తెలియచేయలేదు. ఒకవేళ జాగ్రత్త కొరకు చెబితే, అదేరోజు రాత్రి ఆ పనివాడు మూటముల్లే సర్దుకొని బ్రతుకు జీవుడా... అంటూ పారిపోయి ఉండేవాడేమో..??? అందుకని నాయకులు ఏఏ సంగతులను, ఎవరికి ఎప్పుడు చెప్పాలో తెలుసుకొనియుండాలి. అంతేగాని ప్రతిదానిని అసందర్భంగా అందరికి, కొన్నిసార్లు సహచరులకు కూడా చెప్పనక్కర్లేదు. అంటే రహస్యంగా ఉంచమని కాదుగాని, ఎప్పుడు, ఎవరికి, ఏ సంగతి తెలియచెయ్యాలో తెలుసుకోవటం నాయకుల విధి. చెప్పగూడనివి చెప్పటం, చెప్పవలసినవి చెప్పవలసిన సమయంలో చెప్పకపోవటం, వెనుక ముందు, ముందు వెనుకలుగా వ్యవహరించటం జరుగుతున్న, జరుగబోతున్న సేవకు అనర్థాన్ని కలిగిస్తుంది. ఎలీషా తనదగ్గరనున్న పనివానికి జరుగబోతున్న సంగతిని తాత్కాలికంగా మరుగుచేసి, మరునాడు అతని కండ్లను తెరువచేసి గొప్ప అనుభవాన్నందించాడు. కనుక వివేక జ్ఞానంతో దేవుని సేవచేయాలి, అట్టివారిని సేవకులు, విశ్వాసులు వెంబడించాలి.

దేవుడు అగ్ని కంచెతో ఏలీషాను సంరక్షించాడు. మరొక సంగతేమిటంటే వచ్చిన సిరియా సైనికులకు తాత్కాలిక అంధత్వం వచ్చింది. అంటే వారెటువెళుతున్నారో తెలియదు. ఎలీషా పనివాని కండ్లను తెరిపించి, సిరియా సైన్యానికి అంధత్వము వచ్చేటట్లు చేసి వారి నందరిని షోమ్రోనుకు నడిపించాడు (2 రాజులు 6 : 18-23). వారందరూ షోమ్రోనుకు వచ్చిన తరువాత వారి కండ్లను తెరువుమని ఎలీషా ప్రార్థనచేసి దృష్టిని ప్రసాదించాడు. సిరియా సైనికులు వారు ఇశ్రాయేలు రాజధాని షోమ్రోనులో ఉన్నట్లు గ్రహించారు. ప్రాణ భయంతో బిక్కచచ్చిన సిరియా సైనికులకు ఎలీషా సంరక్షకుడయ్యాడు. ఇశ్రాయేలు రాజు వారిని చంపజూస్తే.. వద్దని వారించి విస్తారంగా భోజన పదార్థాలను సిద్ధంచేసి వారికి వడ్డించి తిరిగి వారి దేశానికి క్షేమంగా వెళ్ళేటట్లు జాగ్రత్తపడ్డాడు.

ఇది నిజంగా ఆశ్చర్యం. మాటిమాటికి యిబ్బందిపెట్టే శత్రుసైన్యము చేతినిండా దొరికితే, వారికి భోజనాలు పెట్టి పంపించటమా...!?!?? సామెతలు 25 : 21 - "నీ పగవాడు ఆకలిగొనినయెడల వానికి భోజనము పెట్టుము. దప్పిగొనన యెడల వానికి దాహమిమ్ము". మత్తయి 5 : 46, 47 - "మీరు మిమ్మును ప్రేమించువారినే ప్రేమించిన యెడల మీకేమి ఫలము కలుగును? సుంకరులును అలాగు చేయుచున్నారు గదా! మీ సహోదరులకు మాత్రము వందనము చేసినయెడల మీరు ఎక్కువ చేయుచున్నదేమి? అన్యజనులును అలాగు చేయుచున్నారు గదా?" ఈ మాటలను నిజంగా అనుసరించటం కష్టం గదా! అందుకు దేవుడే మనకు సహాయం చెయ్యాలి. లేకపోతే మనుష్యులుగా అట్టి సహృదయాన్ని అందరికి చూపించలేము... !!

ఎలీషా, ఇశ్రాయేలు రాజైన యెహోరామును నిలువరించి శత్రువుల ప్రాణాలు నిలబడటానికి కారణమయ్యాడు. నిజమైన దైవజనులు ప్రజల ప్రాణ, మాన, ధన రక్షకులు. అట్టి దైవికగుణలక్షణములు గల దైవసేవకుల సంఘములలో ఉన్న విశ్వాసులు ధన్యులు. అందుకే ఆధ్యాత్మిక విజ్ఞానంతో, దేవుని నడిపింపుతోనే ఏ సంఘములో కొనసాగాలో తెలుసుకోవాలి. కొన్ని సంఘాలలో సంఖ్య ఎక్కువుండవచ్చు, మరికొన్నింటిలో తక్కువుండవచ్చు, అది అన్నిమార్లు సంఘనాయకుని కొలమానం కాదు. నిబ్బరంతో, నిస్వార్థంతో, ఏవిధమైన భౌతిక, ఆధ్యాత్మిక ప్రలోభాలకు ప్రజలను గురిచెయ్యకుండా, లేఖనాలను శుద్ధంగా వివరిస్తూ ప్రజలను చైతన్యపరిచేవారే యోగ్యులైన సంఘనాయకులు, ప్రాంత, సామాజికవర్గ, భాషా ప్రాతిపదికలనాధారం చేసుకొని మాత్రమే సంఘాలకు వెళ్ళరాదు మరియు సంఘములను నడుపరాదు. వారెవరైనప్పటికి, వారి యోగ్యత, సహృదయం, నిస్వార్థ లేఖన వివరణే ప్రధానము గాని అనవసర అంశాలు కాదు.

బెన్హదదు తాత్కాలిక మారుమనస్సునొంది, ఎలీషా చూపించిన మంచితనానికి ముగ్ధుడై కొంతకాలం ఇశ్రాయేలీయులను యిబ్బందిపెట్టటం మానివేశాడు. భుజబలంవల్ల సాధించే విజయాలు కొన్నయితే, దేవునియందలి విశ్వాసం, స్థిరత్వం వలన కలిగే విజయాలు మరికొన్ని, ఇవి విశేషమైనవి.

మనము ఈ వ్యాసము ద్వారా గ్రహించే సంగతులేమనగా, దైవజనుడైన ఎలీషా దేవుని మాట విని, విశ్వసించి, సంక్లిష్ట సమయంలో దోతానులో నిలిచిఉండి, అద్భుత సంరక్షణ పొందాడు. తన రాజుకు, ఇశ్రాయేలు దేశమునకు దీవెనగా మారాడు. అంతేకాదు సిరియారాజు సహితము ఎలీషా గొప్పతనాన్ని గ్రహించి మనసు మార్చుకున్నాడు. కనుక దేవునికి అభ్యర్థించి, దైవ సూచనలు పాటించి ఆశీర్వాదాన్ని పొందాలి. కొన్ని పరిస్థితులు భౌతిక నేత్రాలకు సంక్లిష్టముగా కనబడినా, దైవ నేత్రంతో, ఆత్మ జ్ఞానంతో సంగతులను విశ్లేషించి దేవునిలో నిలిచియుండాలి. తద్వారా దేవునిదీవెనలు పొందగలం.

**( సశేషం )**

# మంద కాపరి

**సహోదరి ఎ. ఉషారాణి, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

మరనాత మెసెంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు. కాలములను, సమయములను, పరిస్థితులను చూస్తుంటే, క్రీస్తు సేవకులమైన మనము మరింత త్వరితముగాను, బాధ్యతతోను పనిచేయవలెననెడి విషయము స్పష్టంగా మనకు తెలుస్తుంది. దేవుడు మనకు అనుగ్రహించిన సర్వోన్నతమైన ఆజ్ఞను నెరవేర్చవలసిన బాధ్యత మనందరిపైనా ఉంది. అందుకే పరమగీత గ్రంథకర్త ఈ విధంగా వ్రాశారు - 'నా ప్రాణ ప్రియుడా, నీ మందను నీవెచట మేపుదునో మధ్యాహ్నమున నెచ్చట నీడకు వాటిని తోలుదువో నాతో చెప్పుము' (పరమ 1 : 7). ఒక దైవసేవకుడు సంఘమును / విశ్వాసులను జీవములోనికి నడిపించు విధముగా భారముతో పనిచెయ్యాలి. మందను ఎక్కడకు, ఏవిధంగా నడిపించాలో పరిశుద్ధ లేఖనములలో వ్రాయబడిన సంగతులను ఒకింత పరిశీలన చేద్దాము.

**A) జలము (ఆది 29 : 8) :-** "వారు మందలన్నియు పోగుకాకమునుపు అది మావలన కాదు. తరువాత బావిమీదనుండి రాయి పొర్లించుదురు; అప్పుడే మేము గొర్రెలకు నీళ్ళు పెట్టుదుమనిరి".

ఇస్సాకు కుమారుడైన యాకోబు తన స్వగృహము నుండి పారిపోయి తన మేనమామ గారైన లాబాను స్థలమునకు చేరుకున్న సమయంలో జరుగుతున్న సంఘటన. ఆనాటి పరిస్థితులను పరిశీలన చేస్తే, గొర్రెల మందలన్ని పోగుచేయబడుట ఒక ఎత్తయితే, బావి మీదనున్న రాయి పొర్లించుట మరోఎత్తు. గొర్రెలమందలకు నీళ్ళు పెట్టడం బహు ప్రయాసతో కూడుకున్న విషయం. మందయొక్క దాహార్తి తీర్చబడాలంటే రాయి పొర్లించబడవలసిందే. రాయి పొర్లించుటే మందకాపరి యొక్క బాధ్యత. ఎన్ని గొర్రెలున్నా, ఎంత నిండైన ఆహారం తిన్నా, కాపరులు ఎంతమంది ఉన్నా, బావినిండా నీళ్ళు ఉన్నా రాయి పొర్లించకుండా నీరు అందుట అసంభవం. అందుకే యేసుక్రీస్తు ఒక మాట చెప్పారు - నేనిచ్చు నీళ్ళు త్రాగువాడు ఎన్నటికి దప్పికగొనడు. దేవునియొద్దకు ప్రజలు వచ్చి వాక్యమను ఉదకముతో నింపబడాలంటే, ఆ బరువును దైవసేవకులు మోయాల్సిందే. ఈనాడు సేవ చేసేవారిలో కొద్దిమంది సంఘసంఖ్య విస్తరణ దృష్టిలో ఉంచుకొని ఎన్నోరకాల పద్ధతులు, మీడియా వంటివి బాగా వాడుతున్నారు. పోటీప్రపంచమును తట్టుకొనవలసిన సంఘము, ఈనాడు ప్రపంచముకు అతీతముగా పోటీపడుతున్నాయి అంటే ఆశ్చర్యం కాదేమో. బండసందులలో, పేటబీడులలో నిలువబడగల్గిన ధైర్యశాలురు కావాలి. సంఘాలు సంఖ్యాపరంగా విస్తృతంగా పెరుగుతున్నాయి, ఆధ్యాత్మికత లోపిస్తుందేమో అన్ని కొన్నిమార్లు అనిపించకుండా

ఉండట్లేదు. సంఘము లోకములో ఉంటే తప్పుకాదు కాని లోకమే సంఘములోనికి వచ్చేసింది. లోకపు పద్ధతులు, ఆచారాలు, ఆడంబరాలు, కులవ్యవస్థ, కుటుంబపాలనలు, స్వార్ధచింతన వంటి శక్తులు సంఘాన్ని అలుముకున్నాయి. కాని అలాంటి క్లిష్టసమయంలో వాక్యమే యిందుకు పరిష్కారం. తాను పారిపోతూ, జీవితానికి గురిగమ్యం ఎటో తెలియని యాకోబు ఒక గొప్పపని చేశాడు. తాను దేవునిచేత ఎంపికైన వ్యక్తి అనుటకు యిదియే ఉదాహరణ, యాకోబు రాయిని పొర్లించి, తన మేనమామ మందకు నీళ్ళు పెట్టాడు (ఆది 29 : 10). తాను జీవితంలో సుఖమును అనుభవించకపోయినా, కుటుంబ ఆలన, పాలన లేకపోయినా, తాను అయోమయ స్థితిలో ఉన్నాసరే మందకు నీరు తక్కువ చేయలేదు, అదియే కాపరియొక్క కర్తవ్యం. అందుకే కాబోలు దేవుడు కూడా ఇశ్రాయేలీయులకు ప్రత్యక్షపరచుకున్నప్పుడు నేను యాకోబు దేవుడను అని చెప్పాడు. మన సంఘాలు, విశ్వాసులు దైవలేఖనాలతో కట్టబడాలని ప్రయాసపడదాం. దైవలేఖనాలను క్షుణ్ణంగా తెలుసుకోడానికి అడ్డుగా ఉన్న రాళ్ళను పొర్లించి, వాక్కులో నిలవబడులాగున ప్రయాసపడుదాం. దైవిక వరములను, దైవిక కోణంలో వాడుతూ, లోకమునకు అతీతముగా ఎదుగుతూ, దేవునిని అనుభవించగల విశ్వాసులను తయారుచేద్దాం.

**B) ఫలము (యోహా 11 : 39) :** "యేసు రాయి తీసివేయుడని చెప్పగా... అంతట వారు ఆరాయి తీసివేసిరి".

లాజరు, మార్త, మరియలు యేసుక్రీస్తును బహుగా ప్రేమించిన వ్యక్తులు. తమ యింటిలో యేసుకు స్థానం కల్పించిన వ్యక్తులు. యింత గొప్ప కుటుంబంలో ఒక్కసారిగా మరణపు ఛాయ కమ్మింది. యేసు ఈ వార్తను విని, వస్తారని ఎదురుచూచే ఉంటారు, కాని రాలేదు. చనిపోయిన లాజరు యొక్క శరీరముకు జరుగవలసిన క్రియలన్నీ జరిగిపోయాయి. పరామర్శించేవారు, విషయం పెడదారి పట్టించేవారికి ఆయింట కొదువలేదనే చెప్పాలి. అలాంటి సమయంలో, తాము బహుగా ప్రేమించిన యేసు వారియొద్దకు రానేవచ్చారు. పరామర్శలు, పలకరింపు అయ్యాయి. కాని ప్రభువు యొక్క కార్యముమాత్రం ఆరంభం కాలేదు. తమవలెనే యేసు కూడా కేవలం పరామర్శించడానికే పరిమితమయ్యాడు అని అక్కడ ఉన్న మనుష్యులు అనుకునే ఉంటారు. అనగా దైవమానవునిగా పరమునుండి భూమిమీదకు దిగివచ్చిన యేసును తక్కువగా ఎంచుకున్నారు. తండ్రి స్థానాన్ని తగ్గించే కుమారులను, కుమార్తెలను చూచి ఏ తండ్రి గుండె ఆక్రోశించదంటారు. మరి తండ్రియైన యేసు యొక్క వ్యక్తిత్వాన్ని తగ్గించే ఆ బిడ్డలను గూర్చి ఆ తండ్రి గుండె కన్నీటితో విలపించింది. మానవ ఏడ్పులు, మానవ పద్ధతులు, మానవ పరిమిత ఆలోచనలు దేవుని కార్యాన్ని ఆపలేవు. అందుకే యేసు తాను అనుకున్న పరమకార్యాన్ని జరిగించడానికి సమాధియొద్దకు వెళ్ళాడు. అనుమానించేవారు, విమర్శించేవారు, సందేహించే వ్యక్తులు

**( మిగతా 16 వ పేజీలో.. )**

# 'అట్టివారై యుండుడి' - 16

**( నవంబరు సంచిక తరువాయి)** **రెవ. బి.యం. రాజు, విజయనగరం**

ప్రియ పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**3) గిద్యోను దేవుని తోడు కలిగినవాడు :-** (న్యాయాధి॥ 6 : 12) "నిన్ను ఏ మాత్రము విడువను నిన్ను ఎన్నడును ఎడబాయనని వాగ్ధానము చేసిన దేవుడు గిద్యోనుతో- నేను నీకు తోడైయున్నానని స్పష్టముగా చెప్పెను. ఒక మనుష్యుని హతముచేయునట్లు శత్రువులైనవారిని(మిద్యానీయులను) హతముచేయుదునని దేవుడు గిద్యోనుతో మాటలాడు చున్నాడు. దేవుడు తోడైయుంటే "జయము కలుగుతుంది. అబ్రహాము, ఇస్సాకు, యాకోబు, యోసేపు, దావీదు, దానియేలు, షద్రక్, మెషాకు, అబెద్నెగో మొదలగువారికి తోడైయుండి గొప్ప విజయము కలుగజేసెను. తొట్రిల్లకుండ చక్కగా పోవుబాటను నీళ్ళకాలువలయొద్ద వారిని నడిపించెను (యిర్మీయ 31 : 9). తొట్రిల్లకుండ కాపాడే దేవుడు (యూదా 24 వ॥).

**దేవుడు ఎవరికి తోడై ఉంటాడు :-** దేవుని యందు భయభక్తులు కలిగినవారికి, విశ్వాసము, నమ్మకత్వము, విధేయత మొదలగు గుణములు కలిగినవారితో దేవుడు తోడుగా ఉంటాడు. గిద్యోనులో ఈ యోగ్యతలను దేవుడు చూచి అతనికి తోడైయున్నాడు. దేవుడు తోడైఉండబట్టి విజయము పొందెను. దేవుడు తోడులేకపోతే అపజయమే. "యెహోవా మనకు తోడై ఉండని యెడల వారు మనలను ప్రాణముతోనే మ్రింగివేసియుందురు అని కీర్తనాకారుడు తెలియ జేయుచున్నాడు (కీర్తన 124 : 3).

**ఎప్పటి వరకు తోడు :-** యుగ సమాప్తి వరకు సదాకాలము మీతోకూడ ఉన్నానని దేవుడు వాగ్ధానముచేశాడు. వాగ్ధానము చేసిన దేవుడు నమ్మదగినవాడు గనుక మన నిరీక్షణ విషయమై మనము ఒప్పుకొనినది నిశ్చలముగా పట్టుకొందుము (హెబ్రి 10 : 23). దేవుడు తోడుగా ఉంటే లేమిఉండదు, అపజయముండదు. దేవుడు తోడైఉంటే ఆశీర్వాదమేగాని శాపముండదు. మేలేగాని కీడు జరుగదు. అట్టి దేవుడు నీకు తోడైఉన్నాడా? నిన్ను నీవే విమర్శించుకొనిన యెడల తీర్పు పొందకపోదువు. గనుక దేవుని తోడు కలిగిన "గిద్యోను వంటివారై యుండండి".

**4) గిద్యోను బలిపీఠమును కట్టినవాడు :-** (న్యాయాధిపతులు 6 : 24). హెబ్రి భాషలో "బలిపీఠము" అను పదమునకు "వధ స్థానము" అని అర్ధము. బలిపీఠము ప్రార్ధనకు సూచన. బలిపీఠము దేవునితో కలిగియుండు సహవాస స్థాయిని తెలియజేయును. దైవ ప్రత్యక్షత పొంది, దేవుని ఆత్మచేత నింపబడి, దేవుని తోడుకలిగిన మనుష్యుడు బలిపీఠమును కట్టవలసియున్నది. బయలు దేవతల బలిపీఠములను కూల్చి జీవముగల

దేవునికి బలిపీఠములను కట్టవలెను.

లేఖనములలో అనేకులు పడిపోయిన, శిథిలమైన బలిపీఠములను కట్టినవారు ఉన్నారు. వారి భక్తిజీవితములో బలిపీఠమునకు ఎక్కువ ప్రాధాన్యతనిచ్చినవారుగా ఉన్నారు. అట్టివారిలో గిద్యోను ఒకడైయున్నాడు. నీవును అట్టివాడవై ఉండుము.

మిత్రమా! నీ భక్తిజీవితములో నీ బలిపీఠము (ప్రార్థనాఅనుభవము) ఏస్థాయిలో ఉన్నది. నీ బలిపీఠము పడిపోయి, శిథిలమై, పగిలి, బీటలుపడిఉంటే దానిని పునరుద్ధ రించుట వలన నీవు దైవప్రత్యక్షతను పొంది, ఆధ్యాత్మిక అభివృద్ధిని పొందగలవు. అప్పుడు దేవుడు సంతోషించును.

**5) గిద్యోను దేవుడు చెప్పినట్లు చేసినవాడు :-** (న్యాయాధిపతులు 6 : 27). నీ తండ్రి కట్టించిన బయలు యొక్క బలిపీఠమును పడగొట్టి, దానికి పైగానున్న దేవతా స్థంభమును నరికివేసి తగిన ఏర్పాటుతో ఈ బండకొసన నీదేవుడైన యెహోవాకు బలిపీఠము కట్టి కోడెను తీసుకొనివచ్చి నీవు నరికిన ప్రతిమయొక్క కఱ్ఱతో దహనబలిని అర్పించుమని దేవుడు గిద్యోనుతో చెప్పెను. గిద్యోను దేవుడు చెప్పినట్లు చేసెను (న్యాయాధి. 6 : 25-27; 7 : 2-7). దేవుడు చెప్పినట్లు గిద్యోను చేసి శత్రువులపై విజయము సాధించెను. "మీరును అట్టివారై ఉండండి".

దేవుడు చెప్పినట్లు చేసి ఆశీర్వాదము, ఆరోగ్యము పొందుకొన్నవారు ఉన్నారు. దేవుడు చెప్పినట్లు చేయకుండ పతనమైనవారు ఉన్నారు. నీవు ఎవరిని పోలియున్నావు? దేవుడు చెప్పినట్లు చేసినవారు నోవహు (ఆది 6 : 22), అబ్రహాము (ఆది 12 : 4,7,10,23), కానా పెళ్ళిఇంటివారు (యోహాను 3 : 6,7), సీమోను (లూకా5 : 5), మరియ, మార్త (యోహాను 11 : 39). దైవసేవకులు చెప్పినట్లు చేసినవారు - విధవరాలు (1 రాజులు 17 : 15), నయమాను (2 రాజులు 5 : 14). నీవును ఆలాగు చేసి దైవదీవెన పొందుకో.

**6) గిద్యోను ప్రజలను యుద్ధమునకు సిద్ధపరచినవాడు :-** మిద్యానీయులు, అమాలేకీయులు, తూర్పున ఉండువారు. ఇశ్రాయేలు మైదానములో దిగిరి. గిద్యోను, మనష్షే, ఆషేరు, జెబూలూను, నఫ్తాలి గోత్రములవారి యొద్దకు దూతలను పంపగా వారందరు గిద్యోను యొద్దకు రాగా, గిద్యోను "యుద్ధములో పాటించవలసిన క్రమమును గూర్చి" వారికి బోధించి వారిని మూడు గుంపులుగా చేసి బూర, వట్టి కుండను, ఆకుండలో దివిటీలను ప్రతివాని చేతికిచ్చి వారితో "నన్ను చూచి" నేను చేయునట్లు చేయుడి. నేను వారి దండు కొట్టకొనకు పోవుచున్నాను. నేను చేయునట్లు మీరు చేయవలెను. నేనును నాతో ఉన్నవారందరును బూరలను ఊదుచూ, యెహోవాకును, గిద్యోనుకును విజయమని కేకలువేయవలెనని చెప్పి వారిని యుద్ధమునకు సిద్ధపరచెను (న్యాయాధి. 6 : 32-35; 7 : 16-18). సిద్ధపడినవారు గిద్యోనుతో కలిసి యుద్ధముచేసి శత్రువులను ఓడించిరి.

గిద్యోను సిద్ధపడి అనేకులను సిద్ధపరచినట్లు ప్రతిఒక్క విశ్వాసి అనేకులను క్రీస్తు యేసు సేవకులుగాను, విశ్వాసవీరులుగాను సిద్ధపరచవలెను. ఎందుకనగా, భూమిమీద నరుల కాలము యుద్ధకాలము (యోబు 7 : 1). యుద్ధములో విజయము సాధించాలి అంటే ఆత్మీయముగా, శారీరకముగా, మానసికముగా సిద్ధపడాలి. ఎందుకనగా మనము పోరాడునది శరీరులతో కాదగాని ప్రధానులతోను, అధికారులతోను, ప్రస్తుత అంధకార సంబంధులగు లోకనాధులతోను, ఆకాశమండలమందున్న దురాత్మల సమూహములతోను పోరాడుచున్నాము (ఎఫెసి 6 : 12). గనుక నీవు సిద్ధపడి నీతోకూడ కలిసిన సమూహము నంతటిని సిద్ధపరచుము (యెహెజ్కేలు 38 : 7). ఇది నీ బాధ్యత, నీ కర్తవ్యముగా భావించి చక్కగా నిర్వర్తించి గిద్యోనువంటివారై యుండండి. **- మరనాత. ( సశేషం )**

## ( 13 వ పేజీ తరువాయి.. "మంద కాపరి ' )

ఏ పనిలోనైనా, ఏ యింటిలోనైనా మనకు ఎదురౌతారు. తాను చెయ్యాలని తలపెట్టిన కార్యము జరిగించుటకు యేసు సమాధి దగ్గరకు వెళ్ళాడు. సమాధిని చాలా భద్రంగా రాయిపెట్టి మరీ మూసేశారు. బ్రతికిఉన్నవాడు ఎక్కడున్నా సమాజం పట్టించుకోదు కాని చచ్చిన వారికి మంచి సమాధులు కడుతుంది, ఎంత విచిత్ర లోకమో కదా! మొత్తానికి యేసు, ఆయనతోపాటు శిష్యులు, ఏమి జరుగుతుందా అని అనుమానంతో ఉన్న ప్రజలు సమాధి దగ్గరకు చేరుకున్నారు. అప్పుడు యేసు - రాయిని పొర్లించమని చెప్పాడు. యేసుదేవుడు అందించే జీవము అనే ఫలము కనిపించాలంటే రాయి తీసివేయ బడాలి. రాయి తియ్యాలంటే కొద్దిమందికి భయం, కొందరు మార్తలా ప్రభువా కంపుకొడుతుంది అంటే, మరికొందరు అంతరాయి తీయకపోతే పనులు జరుగవా? అని, మరికొందరు మన పద్ధతులు, ఆచారాలు మంటకలుస్తున్నాయి అనేవారు ఎప్పుడూ ఉంటారు. చుట్టూనున్న వందలమందిని చూడటం కంటే, ఎదురుగా నిలువబడిన యేసును చూస్తే చాలు మనలోనికి జీవము దిగివచ్చి, మనమే ప్రపంచమునకు ఒక అద్భుతంగా మారుతాము. ఫలాని కార్యము జరుగదు, నేను దేవునికోసం జీవించలుదు, యిక జరగటం అసంభవము అని హద్దులు, సరిహద్దులు గీసి రాళ్ళు అడ్డంగా పెట్టుకున్న మనము ఈ రోజున రాయిని తీసివేద్దాం. అప్పుడు యేసు స్వరములోని జీవము మనలోనికి, మన కార్యములలోనికి దిగివచ్చి ప్రజలముందు ఆశ్చర్యంగా నిలువబడగల్గుతాము. నమ్మకము, విశ్వాసములను మన ఆయుధాలుగా చేసుకుందాము. అప్పుడు మనము అద్భుతమైన దేవుని కార్యాలను చూడగలము.

ప్రియ పాఠకులారా, మనకు అడ్డముగా ఉన్న రాళ్ళను ప్రక్కకు నెట్టుకొని క్రీస్తు యొక్క జలమును, ఫలమును పొందుకొని దేవుని నామమును ఈలోకములో మహిమ పరుద్దాం. **- మరనాత.**

# జ్ఞానధార

1. తనకు నచ్చిన పనిని ప్రతివాడు చేస్తాడు కానీ
   చేస్తున్న ప్రతి పనిని ప్రేమించేవాడు కాబోయే విజేత.

2. మంచి క్షణం కోసం ఎదురుచూడకు, ఉన్న క్షణాన్నే మంచిగా మలచుకో!

3. మన శక్తికంటే మన సహనం చాలాసార్లు మంచి ఫలితాన్నిస్తుంది.

4. మన మాటలు చెప్పే దానికన్నా మన జీవితం చెప్పేదే ఉత్తమమైనది.

5. మనం ఎంత చదివితే మన అజ్ఞానం అంత బయటపడుతుంది.

6. జీవితాన్ని విఫలం చేసే ప్రమాదకర లక్షణం, తొందరపాటు.

7. మనం సమాధానంలో భాగం కావాలి కానీ సమస్యలో భాగం కాకూడదు.

8. మనకు జరిగేది కాదు, మనలో జరిగే మార్పు గొప్పది.

9. అందమైన శరీరం చూచి మురిసిపోకండి,
   దాని విలువ గుప్పెడు బూడిద మాత్రమే!

10. ఆచరణలేని ఆలోచన వృధా, ఆలోచనలేని ఆచరణ వ్యర్థం.

11. నీ సవాళ్లను పరిమితం చేసుకోకు, నీ పరిమితుల్ని సవాల్ చెయ్యి.

12. ఎదుటివారి తప్పకు మనల్ని మనం శిక్షించుకోవడం కోపం.

13. తన బలహీనతలను గుర్తించలేని ఏవ్యక్తి కీర్తి శిఖరాలను అధిరోహించలేడు.

14. దూరం దూరంగా నాటిన మొక్కలుకూడా అవి పెరిగేకొద్దీ దగ్గరవుతాయి,
    కానీ మనుష్యులు పెరిగేకొద్దీ ఒకరికొకరు దూరమవుతున్నారు.

15. ఎవరైనా నవ్వితే మనవల్ల నవ్వాలి కానీ మనల్ని చూచి నవ్వకూడదు.
    ఎవరైనా ఏడిస్తే మనకోసం ఏడ్వాలి కానీ మనవల్ల ఏడవకూడదు.

- డా॥ మనష్షే కొటారి

# హెబ్రీ పత్రిక ధ్యానములు - 39

రెవ. గొట్టిపాటి యేసుదాసు, రేపల్లె

ప్రభువు దీవెనలకు పాత్రులైన మరనాత మెసేంజర్ పాఠకమిత్రులకు పత్రికాముఖమున శుభాభివందనములు. 2019 ఫిబ్రవరి మాసపు సందేశము చదువుతున్న మీరు ధన్యులు. మిమ్ములను, మీ కుటుంబము, సంఘములను దేవుడు బహుగా దీవించును గాక. హెబ్రీపత్రిక ధ్యానాలలో 13 : 14-17 భాగాన్ని ఈమారు ధ్యానించుదాము. ఈ పుస్తకములోని చివరి అధ్యాయములో పౌలుభక్తుడు, ప్రాచీన అలవాట్లు అనే చెత్త, ఆచారాలనే కసవును కాల్చివేసి హృదయాలను నూతన బలిపీఠాలుగా సిద్ధపర్చుకోమని చెప్పి, మనము ఎంతటి ఆధునిక పరికర సముదాయమున్న పట్టణాలలో నివసించినా ఈలోకంలో నిలవర పట్టణము మనకులేదని, శాశ్వతమైన మరో పట్టణము కొరకు సిద్ధపడుతూ ఎదురు చూడాలని వ్రాస్తున్నాడు.

**స్థిరమైన పట్టణము :** హెబ్రీ 11 : 10 లో దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడై యున్నాడో, పునాదులుగల ఆ పట్టణము కొరకు అబ్రహాము ఎదురుచూచుచుండెను అని వ్రాయబడింది. గుడారాలలో సంచరిస్తూ, కృపలో కోటీశ్వరుడైనా తన దృష్టిని ఈ శాశ్వతలోకముపైనే అబ్రహాము ఉంచాడు. సంపదలమధ్య ఉన్నా ఈ అశాశ్వత లోకములో స్థిరపడదలచుకోలేదు. 1 పేతురు 2 : 11 ప్రకారం పరదేశులమైన మనము ఈలోకములో యాత్రికులమని, ఏదో ఒకదినము మన యాత్ర ముగించి స్వదేశానికి వెళ్ళిపోతామన్న నిరీక్షణతో బ్రతకాలి. యాత్ర ముగింపులో మన సామాను సర్దుకొనుట ముఖ్యము. ట్రైను, బస్సు ప్రయాణములో మన పట్టణము సమీపిస్తుండగా మన లగేజి తీసుకుని మనం ప్రయాణించే వాహనాన్ని నిర్దాక్షిణ్యముగా విడిచిపెడ్తాము కదా! అలాగే ఈలోకము మనకు స్థిరము కాదు.

**దాని నైసర్గిక స్వరూపము :** ప్రకటన 21 : 9-27 భాగములో ఆ పరలోక పట్టణ వివరాలున్నాయి. ఈ పట్టణము పెండ్లి కుమార్తె అని, గొఱ్ఱెపిల్ల యొక్క భార్య అని వ్రాయబడింది. యెరుషలేము అను మహిమగల పరిశుద్ధ పట్టణము పరలోకము నుండి దేవుని దగ్గరకు దిగివచ్చుట చూచును, అది ఎత్తయిన ప్రాకారాలుగల 12 గుమ్మము ల పట్టణము, ధగధగ మెరిసే సూర్యకాంతముత్యమువంటి కాంతి దానిలో ఉండి, ఇశ్రాయేలు 12 గోత్రముల పేర్లు ఆ గుమ్మాలమీద వ్రాయబడ్డాయని యోహాను వ్రాస్తున్నాడు. తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణాలలో ఒక్కొక్క దిక్కున మూడు గుమ్మముల చొప్పున ఉండగా, ఆపట్టణ ప్రాకారాలకు 12 పునాదులున్నాయి. వాటిపై 12 మంది అపోస్తలుల పేర్లున్నాయి. చతురస్ర ఆకారములో ఉన్న ఆ పట్టణము బంగారు కొలకర్రతో కొలుచునప్పుడు దాని పొడవు, వెడల్పు, ఎత్తు సమానముగా ఉంది. సమాన కొలతలు 750 కోసులు. కోసు అనగా రెండు మైళ్ళు. అంటే 1500 మైళ్ళు ఎటుచూచినా సమానకొలత అన్నమాట. దీన్ని

గణితప్రకారము హెచ్చిస్తే 337 కోట్ల 50 లక్షల చదరపు మైళ్ళు అని గణాంక నిపుణులు చెప్తున్నారు. ప్రస్తుత గుర్తింపు పొందిన 203 దేశాలలో 750 కోట్లకు మించిన ప్రజలంతా రక్షింపబడితే, ఒక్కొక్కరికి ఒక బంగారు గది ఇక్కడ ఉంది. ప్రపంచ మతగ్రంథాలలో ఎక్కడా పరలోక స్వరూపసౌందర్యము ఇంత వివరముగా వ్రాయబడలేదు.

పునాది రత్నాలలో 1) సూర్యకాంతపురాయి, 2) నీలము, 3) యమునారాయి, 4) పచ్చ, 5) వైఢూర్యము, 6) కెంపు, 7) సువర్ణరత్నము, 8) గోమేధికము, 9) పుష్యరాగము, 10) సువర్ణ సునీయము, 11) పద్మరాగము, 12) సుగంధము. ఇంతటి వైభవోపేతమైన మహిమగల పట్టణానికి ఒకే ఒక దీపము ఆశ్చర్యము కదా! ఆ దేవాలయము, దీపము గొఱ్ఱెపిల్లయగు క్రీస్తే. అందుకని పరలోకపట్టణములో దేవాలయము లేదు. ఎందుకనగా భూలోకమందలి సకలభాషాప్రవీణులంతా ఇక్కడికి చేరి ముక్తకంఠాలతో ఆయనను ఆరాధిస్తారు. మరో విషయమేమంటే అక్కడ రాత్రి లేదు. గొఱ్ఱెపిల్ల ముఖకాంతిలోని శాశ్వత పగలు మాత్రమే ఉంటుంది. లోకమందలి విశ్వాస బృందమంతా కలిసి దేవుని మహిమ ఘనతలను ఈపట్టణానికి తెచ్చి వారంతా దాని మహిమలో సంచరిస్తారు. భూరాజులలో కొందరు మనకు కన్పిస్తారు. అందుకే పాలకవర్గము రక్షణకై మనము ప్రార్థించాలి.

**మన సిద్ధపాటులో :** స్తుతిచేయుట, సాక్ష్యమిచ్చుటతోపాటు బీదలకు దరిద్రులకు ఉపకారధర్మము దేవునికి ఇష్టము అంటున్నాడు పౌలు. బీదలు కొందరు విశ్వాసులై దేవుడు వార్ని దీవించకముందు కుటుంబం గడవనివారైయుండగా, ఆహారవస్త్రాలలోగానీ, చదువులలోగానీ, అనారోగ్యములోగానీ కలిగినవారు కొంత సహాయము చేయవలసిన వారైయున్నారు. అదే సమయములో ఒకప్పటి దరిద్రులు దీవించబడితే వారిని నిష్టురపెట్ట వద్దు. ఎందుకనగా, దరిద్రులను దీవించమనే మనం ప్రార్థించాము కాబట్టి వారు ఎదిగితే మనం సంతోషించాలి. దేవునిలో ఎదిగినవారు సంఘాభివృద్ధికై తప్పక సహకరించాలిగదా! ముఖ్యముగా రక్షింపబడిన ప్రతివారు వాక్యానుసారముగా దశమభాగాలు తప్పక సంఘములో చెల్లించాలి. సంఘము యొక్క అవసరతలు, ఖర్చులు గుర్తించి సహకరించిన ప్పుడు (ధనసహాయం, సువార్త) సంఘం అభివృద్ధిలో నడుస్తూ అనేకులను సంపాదిస్తుంది.

**ఆత్మలను కాయుచున్న నాయకులు :** సంఘ స్థాపన, దానిక్షేమముకై ప్రయాసపడు నాయకులు దుఃఖముతో పరిచర్య (అవసరములుతీరక) వేదనతో చేసిన యెడల ఆ సంఘములోని మీకు ఎలా ప్రయోజనము జరుగుతుంది? ఆహారపానీయాలు, వస్త్రాలు, వాహనాలు వాటిని నడిపేవారి ఖర్చులు, పన్నులు, కరెంటు బిల్లులు వంటి అవసరతలన్నీ సంఘంనుండే తీర్చబడాలి. యోగ్యులై చేయగల్గినవారు మౌనముగా ఉంటే సంఘ అవసరతలు తీరవు. నేటి గొప్పవారంతా తక్కువలో దేవునికిచ్చి హెచ్చింప బడినవారే. కాబట్టి వారు దుఃఖముతో కాక ఆనందముగా పనిచేయునట్లు వారి నోటనుండి వచ్చు దేవుని మాటలు విని, వారికి లోబడి వారితో కలిసి పనిచేయాలి. ఎందుకనగా దైవ జనుని మాటకు అధికారమిచ్చింది దేవుడే. ఆ అధికారముతోనే ఒక సామాన్య మనిషి దైవజనుడై

ఆత్మల సముపార్జనతో సంఘస్థాపన, మందిర నిర్మాణాలు జరిగిస్తాడు. ఆత్మల రక్షణకై పోరాడకుండా నాయకులనిపించుకునేవారికి లోబడనవసరములేదు. అపో॥ కా॥ 4 : 9 సత్యానికి లోబడని యూదామతాధికారులతో పేతురు, యోహానులు దేవుని మాట వినుటకంటే మీమాట వినుట దేవుని దృష్టికి న్యాయమా? అంటూ వార్ని ఎదిరించారు. అపో॥ కా॥ 5 : 29 లో మనుష్యులకు కాదు దేవునికే మేము లోబడాలి కదా అన్నాడు పేతురు. మంచి నాయకులు సంఘ సభ్యులకు కాపరులైయుండాలి. "దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన తన సంఘమును కాయుటకు పరిశుద్ధాత్మ మమ్మును దేని యందు అధ్యక్షులనుగా ఉంచెనో, ఆ యావత్తు మందను గూర్చియు, మీమట్టుకు మిమ్మును గూర్చియు జాగ్రత్తగా ఉండుడి" (అపో॥ కా॥ 20 : 28). సంఘ నాయకులు తమ వ్యక్తిగత జీవితాల గురించి, కుటుంబాల గూర్చి మాత్రమే కాక దేవుని ప్రజలపై నాయకత్వాన్ని గూర్చి కూడా దేవునికి లెక్కచెప్పాలి (హెబ్రి 13 : 17).

**కాపరుల కొరకు ప్రార్ధన :** అర్ధరధులైన అతి సామాన్యులను అద్భుతమైన అతిరధ, మహారధులుగా తయారుచేయబడిన దైవదాసులు మానిమిత్తము ప్రార్ధన చేయుమని కోరుట అశ్చర్యమే. దైవదాసులు ఆధ్యాత్మిక సామర్ధ్యము గలవారైనా భయంకర శ్రమలమయమైన ఈలోకపు పరిచర్యలో విశ్వాసుల ప్రార్ధన దైవసేవకులకు ఎంతో అవసరము. రోమా ఖైదీగా పౌలుభక్తుడు త్యాగధనుడైనా, నీప్రార్ధనలు మూలంగా నేను నీకు అనుగ్రహించబడుదునని నిరీక్షించుచున్నాను. నేను విడుదలై వస్తాను, నాకొరకు బస సిద్ధముచేయుమని ఆత్మీయకుమారుడైన ఫిలేమోనుకు ఉత్తరం వ్రాయుట విశేషము (ఫిలేమోను 22 వచనం). 1 తిమోతి 2 : 8 లో ప్రతి స్థలమందును పురుషులు కోపము, అనుమానము లేకుండా పవిత్రమైన చేతులెత్తి ప్రార్ధించాలని పౌలుగారు కోరుతున్నాడు. అపో॥ కా॥ 12 : 5-10 లో సంఘము యొక్క ఆశక్తిగల ప్రార్ధనకు చెరసాలలోని పేతురు సంకెళ్ళు ఊడిపడినట్లు చూస్తున్నాము. నిర్గమ 17 : 12 లో అహరోను, హూరులు మోషే చేతులను పైకెత్తి ఆదుకున్నప్పుడు ఇశ్రాయేలీయులకు జయము కల్గింది. అభిషిక్తుడైన దైవజనుడు మనకు అనుగ్రహించబడుట మన అదృష్టము. కానీ సంఘము విజయోత్సాహాల తో అభివృద్ధి నొందుటకు సంఘస్తుల ప్రార్ధనాసహకారము ఎంతో అవసరము.

**సంఘానికి పౌలు ఆశీర్వాదము :** గొఱ్ఱెల గొప్పకాపరియైన యేసు అను మన ప్రభువును నిత్యమైన నిబంధన సంబంధమగు రక్తమును బట్టి మృతులలోనుండి లేపిన సమాధానకర్తయగు దేవుడు, యేసుక్రీస్తు ద్వారా తన దృష్టికి అనుకూలమైన దానిని మనలో జరిగించుచూ ప్రతి మంచి విషయములోనూ తన చిత్తప్రకారము చేయుటకు మిమ్మును సిద్ధపర్చును గాక! (హెబ్రీ 13 : 20-21). అవును, అనుదినము మనతో ఉండి మనయత్నాలను సఫలంచేస్తూ, ఆత్మదేవుడే మనలను సిద్ధపర్చాలి గానీ మనలను మనమే సిద్ధపర్చుకోలేము. కొన్నిసార్లు చిన్న ప్రయత్నములోనే గొప్ప ఫలితాలను పరిచర్యలో చూస్తాము. ఆశించినదానికంటె ఎక్కువ లాభాన్నికూడ చూస్తాము. అలా దేవుడు మనతో

**( మిగతా 23 వ పేజీలో.. )**

# ఫిలిప్పీ పత్రిక

**శ్రీమతి దేవినేని నిర్మల, అధ్యాపకురాలు, మరనాత బిబ్లికల్ సెమినరి, విజయవాడ**

ప్రియ మరనాత మెసేంజర్ పాఠకులకు ప్రభువైన క్రీస్తు నామమున శుభములు. 2018 సంవత్సరమంతా మనము చేసిన ఎన్నోప్రార్ధనలకు దేవుడు సమాధానమనుగ్రహించెను. అటువంటి విశ్వాససహితమైన ప్రార్ధన మానవ హృదయాలలో ఎల్లవేళలా కావలియుండునని, అటువంటి ప్రార్ధనాజీవితము ప్రతి విశ్వాసి తన జీవితంలో గత సంవత్సరమంతా ఏ విధముగా కలిగియుండెనో అదే విధముగా ఈ సంవత్సరములో కూడా కలిగియుండాలని నా ఆకాంక్ష. దీనిగురించి మనము గత సంచికలో నేర్చుకొనియున్నాము. ఈ సంచికలో అపోస్తలుడైన పౌలు ఫిలిప్పీ 4 : 8,9 వచనాలలో "True Countries of the Mind" అనగా "మానవ మేధస్సు యొక్క వాస్తవికమైన సంగతులను" గూర్చి మనకు ఈవిధముగా తెలియజేయు చుండెను. ఫిలిప్పీ సంఘ విశ్వాసులలో తమ మనస్సులను సరియైన సంగతుల మీద లగ్నంచేసి దాని విషయమైన ఆసక్తితో జీవించుచుండెను. ఇది మానవ జీవితం యొక్క ప్రాముఖ్యమైన సంగతి. అలా ఆలోచించలేని పక్షములో తన జీవితంలో దేనిలోను ముందుకు కొనసాగలేడు మరియు తన ఆలోచనలు గాడితప్పిపోవును. అందువలన మానవుడు తన జీవితంలో కలిగియుండవలసిన ఆలోచనలను పౌలు ఈ భాగంలో ఒక వరుస క్రమంలో ఈవిధముగా మనకు వివరిస్తున్నాడు.

ఈలోకంలో ఉన్న ఆనేక సంగతులు మోసగించేవి మరియు మాయతో కూడుకొనినవి. వాటిద్వారా మనము శాంతి, సంతోషమును సంపాదించగలమని మనలను భ్రమింపచేస్తు న్నాయి. అయితే ప్రతి మానవుడు దుర్ధశలోనికి నడిపించబడకుండా ఉండాలంటే ఉన్నతమైన ఆలోచనలతో మన హృదయము నింపబడాలి. ఆంగ్ల అనువాదములలో ఒకటైన **KJV** లో ఈ సంగతులనే యదార్ధమైనవని, వాస్తవమైనవని తెలిపెను. వీటిని ఇతరుల గౌరవార్ధమై ఉపయోగిస్తారు. ఇవి ఎంతో ఖ్యాతిగలవని, వీటిద్వారా మన జీవిత విలువలు వృద్ధిచెందునని గ్రహించాలి. అలా వృద్ధి చెందాలంటే ప్రతి క్రైస్తవుడు యోగ్యతతో కూడిన జీవితమును జీవించాలి. ఆ యోగ్యతలోనుండే ఇతరులను దీవించే సంగతులు బయలువెడలును.

**యోగ్యత, మెప్పు :-** ఇది ఒక క్రైస్తవుడు కలిగియున్న ఉన్నత దశను చూపిస్తుంది. యోగ్యమైన ప్రవర్తన ద్వారా ఒక వ్యక్తి అనేకులచేత యోగ్యుడుగా ఎంచబడి, మెప్పు పొందుకొనును. దీనికి వాడబడిన గ్రీకు పద భావమును గమనిస్తే ఆలయంలో ఉండే దేవుళ్ళకు ఉపయోగిస్తారు. దానినే ఒక మనిషిని గూర్చి వివరించవలసివస్తే దేవాలయంలో దేవుడు ఎలావర్ణించబడతాడో అలాగే ఈప్రపంచములో మానవుని గూర్చి తెలియజెప్పబడింది. మాత్యూ ఆర్నాల్డ్ అనే పండితుడు ఈ అనువాదమును ఎంతో గొప్పగా ఎంచెను. పరిశుద్ధతకు సూచనగా ఈ మాట ఇక్కడ గొప్పగా చెప్పబడినది. ఈ ప్రపంచంలో ఉండే అనేక సంగతులు

ఎంతో తక్కువగా, చులకనగా మరియు అల్పులను ఆకర్షించే విధముగా ఉంటాయి. కానీ ఒక క్రైస్తవుడు తన మనస్సును ఘనమైన విషయాలపై లఘ్నంచేసినట్లయితే అవి ఆ వ్యక్తి జీవితాన్ని ఎంతో ఉన్నత దశలోనికి నడిపించును.

**1. సత్యమైనవి :-** దీనికి గ్రీకులో వాడబడిన పదము 'డికాయియోస్' (Dikaios). అనగా ఒక వ్యక్తి తాను విశ్వసించిన దేవునికి, మానవులకు ఏది చెల్లిపంవలెనో దానిని చెల్లించుట, మరొక విధంగా ఆలోచిస్తే తాను చెయ్యవలసిన విధిని సంపూర్తిచేయుట. మానవులలో కొంతమంది తమ హృదయమును వ్యక్తిగత ఆనందాన్ని, సౌఖ్యాన్ని, సులభతరంగా సుఖంగా జీవించే మార్గమును ఎన్నుకుంటారు. ఈవిధంగా ఎన్నుకొనుటలో తమ తోటివారికి ఎంత కష్టమెదురైననూ పట్టించుకోరు. కానీ క్రైస్తవుల యొక్క ఆలోచనలు మాత్రం ఎల్లవేళలా అటు దేవుని పట్ల మరియు ఇటు మానవులపట్ల తమ విధులను నిర్వర్తించుటయే ఆనందంగా ఎంచుకొంటారు. అదే క్రైస్తవుని యొక్క సత్యమైన జీవితం.

**2. పవిత్రమైనవి :-** గ్రీకులో 'హగియోస్' అని వాడబడినది. అనగా నీతియుతమైన పవిత్రతను కనపరుస్తుంది. దేవునిని ఆరాధించే సమయంలో, దేవుని సన్నిధిలో వ్యక్తిగతము గా కనపరచుకొనవలసిన పవిత్రతను కనపరుస్తుంది. ఈ ప్రపంచమంతా నీచమైన మరియు భ్రష్టత్వం కలిగిన సంగతులతో నిండియున్నది. మానవులు తమ హృదయాలను ఇటువంటి వాటిమీద కాక తమ జీవితములో పవిత్రత కలిగించే సంగతుల మీద దృష్టియుంచాలి. క్రైస్తవుల మనస్సు ఎప్పుడు పవిత్రతను ధరించుకోవాలి. దేవుడే దిగివచ్చి పరీక్షించిననూ ఆ పరీక్షలో నిలిచేదైయుండాలి.

**3. మాన్యమైనవి, రమ్యమైనవి :-** కొంతమంది హృదయాలు పగ, ప్రతీకారాలతో, అసూయ, ద్వేషాలవైపు ఆకర్షింపబడుతూ ఉంటాయి. మరియు విమర్శలతో, తృణీకారంతో, నిందాపూరితమైన మాటలతో ఉంటాయి. కానీ దానికి విరుద్ధంగా తన మనస్సును క్రీస్తును అంగీకరించినవారు క్రీస్తు యొక్క ప్రేమతో నింపుకొనియుండాలి. ఆ ప్రేమ దయతోను, జాలితోను, ఇతరులను భరించేవిధంగా ఉంటూ ప్రజల హృదయాలలో స్థానం సంపాదించు కొనేదిగా ఉండాలి.

**4. న్యాయమైనవి :-** గ్రీకులో దీని భావము ఉన్నది ఉన్నట్లుగా మాట్లాడుట. ఇతరులను నొప్పించకుండా వారి తప్పిదములను వారికి తెలియజెప్పుట. ఇది సంపాదించుకొనుట అంత సులభం కాదు. మనము ఇతరులతో సంభాషించే విధానమును బట్టి ప్రజలు మనలను గూర్చి మంచి అభిప్రాయం కలిగియుందురు. దేవుని సన్నిధిలో అర్పణ అర్పించే ముందు ప్రతి ఒక్కరూ ఎంతో నిశ్శబ్దంగా వేచియుంటారు. అలాగే మాట్లాడేటప్పుడు త్వరపడికాక, ఏమి మాట్లాడాలో, ఏమి వినాలో తెలుసుకొని దానిప్రకారము మనము ఉండాలి. ఈ ప్రపంచంలో మానవులు ఎన్నో అసభ్యకరమైన, అపవిత్రమైన మాటలు ఉపయోగిస్తారు. కానీ దానికి విరుద్ధంగా క్రైస్తవులైన వారి పెదవులమీద దేవుని వాక్కులను ఉంచుకొని దేవునిని మహిమపరచాలి.

**5. ఖ్యాతిగలవి :-** మానవ జీవితాలలో ఆధ్యాత్మిక వృద్ధిని తీసుకొనివచ్చే మరొక పదమును అపోస్తలుడైన పౌలు ఇక్కడ వివరిస్తున్నాడు. అనగా శ్రేష్టమైన ఆలోచన. ఇది ఒక ప్రదేశము యొక్క ఔన్నత్యమును, ఒక వస్తువు యొక్క ఉన్నతత్వమును, బలము కలిగిన ఒక సైనికుని యొక్క ధైర్యమును మరియు మానవుని యొక్క సహనమును చూపిస్తుంది. ఈ లోకానుసారమైనవాటిని జయించాలంటే తప్పనిసరిగా ఉన్నతముగా ఆలోచిస్తూ, ఉన్నతముగా జీవించాలి.

పైన చెప్పబడిన వాటినన్నింటిని వివరించిన తదుపరి పౌలు భక్తుడు ఫిలిప్పీ సంఘ విశ్వాసులను సవాల్‌చేస్తూ, మీరు నావలన ఏవి నేర్చుకొని అంగీకరించితిరో, వేటిని వింటిరో, వేటిని చూచితిరో అట్టివాటినే చేయుడని చెప్పెను. అప్పుడే ప్రేమ, సమాధానము లకు కర్తయగు దేవుడు మీకు తోడుగా ఉండునని తెలియజెప్పెను. **- మరనాత. (సశేషం)**

---

## ( 20 వ పేజీ తరువాయి.. ‘ హెబ్రీపత్రిక ధ్యానములు - 39 ’ )

కలిసి పనిచేయడాన్ని మనము చూచి ఆశ్చర్యపోతాము. ఒకసారి ఆలోచిస్తే దేవుడు మనతో ఎంతోకాలంగా నడుస్తూ మనలను సంరక్షిస్తూనే ఉన్నాడుగానీ కొన్ని విషయాలలో ఆయనను మనమే సంతోషపర్చలేకపోతున్నాము.

దేవుడు మనపై పెట్టుకున్న ఆశయాలను గ్రహించి, ఆయన లక్ష్యమే మన లక్ష్యముగా భావించి, ఆయన మనతో కలిసివస్తేనే జయమని నిశ్చయించి, ఆయన సంకల్పము నెరవేర్చుట ముఖ్యమని ఎంచి, ఆయన ఉండమన్నచోట ఉండి, పెట్టింది తిని, చేయమన్నదే చేద్దాము. ప్రకటన 5 : 10 ప్రకారము ఆయన రక్తముతో కొనుకున్న మన ద్వారానే అద్భుతాలను ఆత్మల రక్షణ కార్యాన్ని చేస్తాడు. “మనమే పనిచేయుట కాదుగానీ ఆయనను మనతో కలిసి పనిచేయనివ్వాలి”. క్రీస్తు సువార్త ప్రకటన ఉద్యమములో దేవుని కృపాప్రభావాలు యేసుక్రీస్తు ద్వారా తప్ప మరి ఏ ఇతర మార్గములోనూ మనకు లభించవు.

**హెచ్చరిక :** తాను వ్రాసిన సంఘాభివృద్ధి యొక్క హెచ్చరికలు కటువుగానూ, లోకస్వేచ్ఛ కు అభ్యంతరముగానూ ఉంటే, దైవసిద్ధాంతాన్ని సత్యమైయున్న క్రీస్తునాధుని సహకారము తోనే మిమ్మును హెచ్చరించానని ఎరిగినా మాటలు సహిస్తూ అంగీకరించాలని వేడు కుంటున్నాను అంటున్నాడు. నాకైనా, మన సోదరుడు ఈమోతికైనా, మీకైనా, లోకమందెవరి కైనా క్రీస్తు పునరుత్థానము ద్వారానే పాపవిమోచన కల్గిందని తెలుసుకోండి. ఈ లేఖ యూదులలోనుండి రక్షణ పొందిన యూదక్రైస్తవుల ప్రవర్తన స్థిరపడేందుకు, వారు లోతైన సత్యాలు గ్రహించేందుకు తోడ్పడుతుందని చెప్తూ, సంఘనాయకులకు, పరిశుద్ధులకు, అప్పటికి తానున్న ఇటలీవారంతా వందనాలు చెప్తున్నట్లు వ్రాసి పౌలు భక్తుడు ఈ పత్రికను ముగిస్తున్నాడు. కృప మీ అందరికి తోడైయుండును గాక. ఆమెన్! **- మరనాత.**

**(హెబ్రీ పత్రిక ధ్యానములు సమాప్తము )**

# వార్తల్లో కొన్ని...

## ఊబకాయంతో కేన్సర్ ముప్పు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 :** ఊబకాయం లేదా అధిక బరువుకు.. 13 రకాల కేన్సర్లకు సంబంధం ఉందని తాజా సర్వే గుర్తించింది. అందుకే ఊబకాయం తగ్గించుకుంటే కేన్సర్ ముప్పు అంతగా ఉండదని సూచిస్తోంది. ఒక్క కేన్సరే కాకుండా టైప్ 2 షుగర్, హృద్రోగ సమస్యలకూ దూరంగా ఉండొచ్చని చెబుతోంది. బ్రెస్ట్, కొలన్, ఎండోమెట్రియల్, స్టమక్, ఒవరియన్, ఎసోఫాజియల్, గాల్‌బ్లేడర్, కిడ్నీ, లివర్, పాంక్రియాటిక్, ప్రొస్టేట్, థైరాయిడ్, మెనింగియోమా కేన్సర్లకు ఊబకాయానికి సంబంధం ఉందని తేల్చారు.

## ధ్యానంతో అలసటకు చెక్ !

**వాషింగ్టన్, ఫిబ్రవరి 6 :** పారిశ్రామికవేత్తలు వృత్తిలో బిజీగా మారితే అలసటతో సరిగా నిద్రపోరు. అలాంటివారు రోజులో కనీసం 10 నిమిషాలు ప్రశాంతంగా ధ్యానం చేస్తే తమ శక్తిని తిరిగి కూడదీసుకోవచ్చునని తాజా సర్వే పేర్కొంది. అమెరికాలోని ఓరెగాన్ స్టేట్ యూనివర్సిటీ పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. రోజులో 44 నిమిషాలు ఎక్కువ నిద్రపోతే ఎంతటి ఉపశమనం కలుగుతుందో.. వారానికి 70 నిమిషాలు ధ్యానం చేయడం వల్ల అంతే ప్రశాంతత లభిస్తుందని సర్వేలో తెలిపారు.

## ధ్యానంతో నొప్పులు మాయం !

**వాషింగ్టన్, ఫిబ్రవరి 1 :** రోజూ కాసేపు ధ్యానం చేస్తే ఆరోగ్యానికి మేలని చెబుతారు. తాజాగా నిర్వహించిన ఒక అధ్యయనంలో దీనికి మరో అంశాన్ని జోడించారు. పూర్తి ఏకాగ్రతతో ధ్యానం చేస్తే దీర్ఘకాలిక నొప్పులనుంచి ఉపశమనం లభిస్తుందని పేర్కొన్నారు. ఈ వివరాలను 'ఎవిడెన్స్ బేస్డ్ మెంటల్ హెల్త్' అనే జర్నల్‌లో ప్రచురించారు. రోజువారీ పనుల్లో భాగంగా కలిగే ఒత్తిళ్లు, నొప్పులనుంచి కూడా బయటపడొచ్చని ఆ అధ్యయనంలో వివరించారు. ధ్యానం వల్ల మనిషి మానసికంగా చాలా ధృడంగా ఉంటారని తెలిపారు. ఫలితంగా ఆలోచనలు, ప్రవర్తనపై పూర్తిగా అదుపులో ఉంటాయని తేల్చారు.

## ఆరోగ్యకరమైన ఆహారంతో ఆందోళనకు దూరం

**వాషింగ్టన్, ఫిబ్రవరి 5 :** ఆరోగ్యకరమైన ఆహారం వల్ల ఆందోళన దూరమవుతుందని తాజా సర్వే పేర్కొంది. వేడిగా ఉన్నప్పుడు కూల్‌కూల్‌గా ఐస్‌క్రీం తింటే ఉపశమనం కలిగినట్లే.. బరువు తగ్గించే, పోషకాలు కలిగిన, కొవ్వును కరిగించే ఆహారం తినడంవల్ల ఆందోళనలు దూరం అవుతాయని సైకోమాటిక్ మెడిసిన్ అనే జర్నల్‌లో ప్రచురించిన అధ్యయనంలో తేలింది. ఆహారం మనిషి మనోవైకల్యంపై ప్రభావం చూపుతుందని, ఫలితంగా ఆందోళన పెరిగి, ఒత్తిళ్లు తట్టుకోలేక ఇబ్బంది పడతారని వివరించింది. అందుకే ఫైబర్ ఎక్కువగా ఉండే ఆహారం, కూరగాయలు తీసుకోవాలని, ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచిస్తోంది.

## మలేరియాకు కొత్త వ్యాక్సిన్ !

**న్యూయార్క్, ఫిబ్రవరి 5 :** ఇప్పుడున్న వాటికన్నా మరింత ప్రభావవంతంగా పనిచేసే మలేరియా వ్యాక్సిన్‌ను అమెరికాలోని చికాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. రోగ నిరోధక వ్యవస్థలోని నిర్దిష్ట కణజాలాన్ని లక్ష్యంగా చేసుకొని ఈ టీకాను అభివృద్ధి చేశారు. దీంతో ఈ వ్యాక్సిన్‌కు ఎక్కువ రోగ నిరోధక శక్తి, యాంటీబాడీ రియాక్షన్ ఉన్నట్లు పరిశోధకులు గుర్తించారు. ప్రస్తుతం మలేరియాకు వ్యాక్సిన్ ఉన్నప్పటికీ అది 30 నుంచి

50 శాతమే ప్రభావం చూపుతోంది. 'ప్రస్తుత మలేరియా వ్యాక్సిన్‌తో పోలిస్తే.. మేం అభి వృద్ధి చేసిన టీకా ఉత్తేజకరమైన ఫలితాన్ని అందించింది' అని చికాగో యూనివర్సిటీ ప్రొఫెసర్ జెఫ్రీ హుబెల్ తెలిపారు.

## శ్వాసతో కేన్సర్ పసిగట్టే బయోసెన్సర్

**లండన్, ఫిబ్రవరి 4 :** ఒక వ్యక్తి తీసుకునే శ్వాసను బట్టి ఊపిరితిత్తులు కేన్సర్ వచ్చే అవకాశాలను ముందే పసిగట్టే బయోసెన్సర్‌ను లండన్‌కు చెందిన యూని వర్సిటీ ఆఫ్ ఎక్సెటర్ పరిశోధకులు రూపొం దించారు. గ్రఫేన్‌తో రూపొందించిన ఈ బయో సెన్సర్‌ను ఈ-నోస్ పరికరాల్లో ఉపయోగించి.. శ్వాస తీసుకొని వదిలినప్పుడు వచ్చే అణువు లను విశ్లేషిస్తారు. ఊపిరితిత్తుల కేన్సర్ బయోమార్కర్‌లో సహజంగా కనిపించే అణువులను గుర్తిస్తారు. ఇది చాలా తక్కువ ఖర్చుతో కూడినదని శాస్త్రవేత్తలు తెలిపారు.

## హెచ్ఐవీ నియంత్రణకు కొత్త ఆధారాలు!

**టొరంటో, ఫిబ్రవరి 4 :** హెచ్ఐవీని నిరోధించి, వ్యాధి నిరోధకశక్తిని పెంచే టీకాను అభివృద్ధి చేసే కొత్త పద్ధతులను పరిశోధకులు కనుగొన్నారు. ఇన్‌ఫెక్షన్ల నియంత్రణ, హెచ్ఐవీ కణాలపై వ్యాధి నిరోధక టీ- కణాలను ప్రతిస్పందించడం మధ్య గల సంబంధాన్ని కెనడాకు చెందిన సిమోన్ ఫ్రేజర్ యూనివర్సిటీ, దక్షిణాఫ్రికాలోని క్వాజులు-నాటల్ యూనివర్సిటీ పరిశోధకులు గుర్తించారు. సాధారణంగా హెచ్ఐవీ కణాలు తన రూపును మార్చుకుని టీ-కణాల నుంచి తప్పించుకుంటాయని ప్రొఫెసర్ మార్క్ బ్రోక్ మన్ తెలిపారు. ఆ కణాలు తప్పించుకోలేని విధంగా వ్యాధినిరోధక శక్తిని పెంచి హెచ్ఐవీ ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు.

## హెచ్ఐవీ కణాలను లెక్కించే పరికరం !

**వాషింగ్టన్, జనవరి 31 :** ప్రపంచాన్ని భయ పెట్టిస్తున్న హెచ్ఐవీని నయంచేసే మందు లను కనుగొనేందుకు చాలామంది శాస్త్రవేత్తలు అనేక ప్రయోగాలు చేస్తున్నారు. అయితే, ఆ మందులను వాడినప్పుడు హెచ్ఐవీ కణాలు ఏమేర తగ్గుతున్నాయో తెలుసుకునేందుకు జాన్ హాప్కిన్స్ యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు ఒక కొత్త పరికరాన్ని రూపొందించారు. సాధారణంగా హెచ్ఐవీ సోకిన కణజాలాల సమూహాన్ని హెచ్ఐవీ రిజర్వాయర్‌గా పిలుస్తారు. ఇందులోని కణాలు నిద్రాణవ్యవస్థలో ఉంటాయి తప్ప వైరస్‌ను వ్యాపింపజేయలేవు. తాజాగా కనుగొన్న ఈ పరికరం హెచ్ఐవీ రిజర్వాయర్‌లోని కణజాలాల సంఖ్యను ఎప్పటికప్పుడు కచ్చితత్వంతో గుర్తిస్తుందని పరిశోధకులు వెల్లడించారు.

## కక్ష్యలోకి జీశాట్ -31

### ఫ్రెంచ్ గయానా నుంచి విజయవంతంగా ప్రయోగం

**శ్రీహరికోట (సూళ్ళూరుపేట), ఫిబ్రవరి 6 :** డీటీహెచ్, ఏటీఎం సేవలను మరింత మెరుగుపర్చే జీశాట్ - 31 ఉపగ్రహాన్ని ఇస్రో విజయవంతంగా కక్ష్యలోకి చేరవేసింది. ఇది దేశీయ 40వ సమాచార ఉపగ్రహం. ఫ్రెంచ్ గయానాలోని కౌరు అంతరిక్ష కేంద్రం నుంచి భారత కాలమానం ప్రకారం బుధవారం తెల్ల వారుజామున 2:31 గంటలకు ఏరియన్-5 రాకెట్ ద్వారా ఈ ప్రయోగాన్ని నిర్వహించారు. జీశాట్ - 31 ఉపగ్రహం ఏటీఎం, డీటీహెచ్ లతోపాటు వీశాట్ నెట్‌వర్క్స్, టెలివిజన్ అప్ లింక్స్, డిజిటల్ శాటిలైట్ న్యూస్‌గ్యాధరింగ్, సెల్‌ఫోన్ సర్వీసులు, బల్క్ డేటా ట్రాన్స్‌ఫర్, ఈ-గవర్నెన్స్ అప్లికేషన్లకు కీలకం కానుంది. 15 ఏళ్లపాటు పనిచేస్తుంది.

## ఆధార్‌తో 'పాన్' లంకె అనివార్యం : సుప్రీం

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 6 :** ఆదాయపన్ను (ఐటీ) రిటర్న్‌లు సమర్పించడానికి ఆధార్‌తో 'పాన్' అనుసంధానం తప్పనిసరి అని సుప్రీంకోర్టు తెలిపింది. న్యాయమూర్తులు జస్టిస్ ఏకే సిక్రీ, జస్టిస్ ఎస్ అబ్దుల్ నజీర్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది.

**STATEMENT ABOUT OWNERSHIP AND OTHER PARTICULARS OF THE MAGAZINE MARANATHA MESSENGER**

# FORM IV

**(See Rule 8)**

| | | |
|---|---|---|
| 1. Place of Publication | : | VIJAYAWADA, A.P. |
| 2. Periodicity of Publication | : | MONTHLY |
| 3. Printer's Name | : | G. MOSES CHOUDARY |
| Nationality | : | INDIAN |
| Address | : | D.No. 59-8/1-6/3,<br>Gayatri Nagar,<br>VIJAYAWADA - 520 008. |
| 4. Publisher's Name | : | G. MOSES CHOUDARY |
| Nationality | : | INDIAN |
| Address | : | D.No. 59-8/1-6/3,<br>Gayatri Nagar,<br>VIJAYAWADA - 520 008. |
| 5. Editor's Name | : | G. MOSES CHOUDARY |
| Nationality | : | INDIAN |
| Address | : | D.No. 59-8/1-6/3,<br>Gayatri Nagar,<br>VIJAYAWADA - 520 008. |
| 6. Name & Address of Individual who own the News paper | : | G. MOSES CHOUDARY<br>D.No. 59-8/1-6/3,<br>Gayatri Nagar,<br>VIJAYAWADA - 520 008. |

**I, G. Moses Choudary, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.**

**VIJAYAWADA** **(Sd.) G. Moses Choudary**

**08-02-2019** **Signature of the publisher**




-: ప్రతుల కొరకు :-

విజయవాడ - 89777 61512: 0866- 2480047

హైదరాబాద్ - 99896 98072

విశాఖపట్నం - 94405 74118

R.N.I.No.66564/83 Regn.No.VJ/023/2018-2020
Posted at BPC, Krishna Lanka, VIJAYAWADA - 520 013.
Printed on 08-02-19 No. of pages 28 Posting date : 9th & 10 of every month

మరనాత విశ్వాస సమాజము సమర్పించు

# మరనాత దర్శనం

## ఆధ్యాత్మిక టీ.వీ. కార్యక్రమములు

దైవదాసులు శ్రీ గుళ్లపల్లి మోజెస్ చౌదరి,

దైవదాసులు శ్రీమతి & శ్రీ అల్లూరి విశ్వప్రసాద్

దైవదాసులు డా॥ నిరీక్షణ కంచర్ల గార్లు

ఆధ్యాత్మిక వర్తమానములు అందించెదరు.

## కల్వరి ఛానల్‌లో

Calvary Tv

బుధవారం రాత్రి 8 - 8 : 30 గంటల వరకు

శుక్రవారం ఉదయం 6:30 - 7 గంటల వరకు

శనివారం రాత్రి 7 - 7 : 30 గంటల వరకు

## ఆరాధన ఛానల్‌లో

ఆరాధన ARADHANA

గురువారం ఉదయం 7 - 7 :30 గంటల వరకు

## శుభవార్త ఛానల్‌లో

SUBHAVAARTHA TELEVISION

సోమవారం మధ్యాహ్నం 1:30 - 2 వరకు

శుక్రవారం రాత్రి 9:30 - 10 గంటల వరకు